



# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక   PEN POWER TELUGU DAILY   ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక :180 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 6 మార్చి 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :180 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 6 MARCH 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


## బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ

- తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయంలో జగన్ మీడియా సమావేశం
- అసెంబ్లీలో ప్రతిపక్షం మాటలు వినే పరిస్థితి లేదని ఆగ్రహం
- అందుకే మీడియా ముందుకు వచ్చామన్న మాజీ సీఎం
- ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండు బడ్జెట్‌లలోనూ మోసం తప్ప ఏమీ లేదని ఎద్దేవా
- ఇప్పటివరకు చంద్రబాబు ఇచ్చింది బోడి సున్నా అంటూ విమర్శ



**పెన్ పవర్ డెస్క్:** 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' అని ఎన్నికల్లో ప్రచారం చేసిన చంద్రబాబు ఇప్పుడు మోసం తప్ప ఏమీ చేయడం లేదని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. ఈరోజు తాడేపల్లిలోని తమ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ... అసెంబ్లీలో ప్రతిపక్షం మాటలు వినే పరిస్థితి లేదన్నారు. అందుకే మీడియా ముందుకు వచ్చామని తెలిపారు. "చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రెండు బడ్జెట్‌లు ప్రవేశపెట్టింది. ఇప్పటివరకు ప్రవేశపెట్టిన రెండు బడ్జెట్‌లలోనూ మోసం తప్ప ఏమీ లేదు. దత్తపుత్రుడితో కలిసి మేనిఫెస్టో విడుదల చేశారు. మేనిఫెస్టో హామీలపై అడిగితే వారి నుంచి సమాధానం రావడం లేదు. ఎన్నికలప్పుడు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ ఊదరగొట్టారు. ప్రతి ఇంటికి బాండ్లు కూడా పంచారు. ఇప్పటివరకు చంద్రబాబు ఇచ్చింది మాత్రం బోడి సున్నా" అని జగన్ ఆరోపించారు. అలాగే 20 లక్షల ఉద్యోగాలు, రూ. 3 వేల నిరుద్యోగ భృతి అన్నారని, రెండు బడ్జెట్‌లలోనూ నిధులు కేటాయించలేదని విమర్శించారు. ఆత్మస్తుతి-పరనింద అన్నట్లుగా కూటమి వార్షిక బడ్జెట్ ప్రసంగం ఉందన్నారు. 4 లక్షల మందికి ఉపాధి కల్పించామని గవర్నర్ ప్రసంగంలో అబద్ధాలు చెప్పించారని మండిపడ్డారు. ఇక తమ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే 1.30 లక్షల ఉద్యోగాలు

ఇచ్చామని, 2.66 లక్షల మంది వాలంటీర్లను నియమించామని జగన్ తెలిపారు. అలాగే ఏపీసీఓఎస్ ద్వారా 96,000 మందికి ఉద్యోగాలు కల్పించామని, ఆర్టీసీ విలీనం ద్వారా 58,000 మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశామన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మొత్తం 6.31 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా జాబ్స్ ఇచ్చామని మాజీ సీఎం వివరించారు.

## పవన్ కు వచ్చిన మెజారిటీ ఎంత, జగన్ కు వచ్చిన మెజారిటీ ఎంత?

- పవన్ కల్యాణ్ పై జగన్ వ్యాఖ్యలు
- జగన్ దిగజారుడు వ్యాఖ్యలు చేశారన్న నారా లోకేశ్
- అహంకారానికి ప్యాంటు, షర్టు వేస్తే జగన్ లాగే ఉంటుందని వ్యాఖ్యలు



**పెన్ పవర్ డెస్క్:** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై వైసీపీ అధినేత జగన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఆ మనిషి కార్పొరేటర్ కు ఎక్కువ... ఎమ్మెల్యేలకు తక్కువ... జీవితంలో ఒక్కసారి ఎమ్మెల్యే అయ్యాడు అంటూ పవన్ పై జగన్ వ్యాఖ్యలు చేశారు. దీనిపై లోకేశ్ మాట్లాడుతూ... డిప్యూటీ సీఎంపై జగన్ వి దిగజారుడు మాటలని విమర్శించారు. అహంకారానికి ప్యాంటు, షర్టు వేస్తే జగన్ లాగే ఉంటుందని అన్నారు. అసలు పవన్ కు వచ్చిన మెజారిటీ ఎంత, జగన్ కు వచ్చిన మెజారిటీ ఎంత? అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నా, అధికారం కోల్పోయినా జగన్ ప్రజలకు దూరంగానే ఉన్నారని లోకేశ్ విమర్శించారు. పరదాల ప్రభుత్వం పోయాక

వివరాలు 2లో..

## అమెరికాకు కెనడా వార్నింగ్




- కెనడాపై 25 శాతం సుంకం విధించిన ట్రంప్
- మస్క్ కు చెందిన స్టార్ లింక్ తో డీల్ రద్దు చేశామన్న డగ్ ఫోర్డ్
- అమెరికా కూడా నొప్పి అనుభవించాలని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి మిత్రుడు, శత్రువు అనే తేడా లేకుండా ట్రంప్ అందరిపై భారీ సుంకాలు విధిస్తున్నారు. తమ పొరుగు దేశం కెనడాపై కూడా 25 శాతం సుంకం విధించారు. ఈ నేపథ్యంలో కెనడా తీవ్రంగా ప్రతిస్పందించింది. ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్టార్ లింక్ తో ఉన్న

వివరాలు 2లో..

## కేదార్‌నాథ్ రోప్‌వేకి కేంద్ర కేబినెట్ ఆమోదం



**పెన్ పవర్ డెస్క్:** కేదార్ నాథ్ వేళ్లే భక్తులకు కేంద్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. సోన్ ప్రయాగ్–కేదార్ నాథ్, హేమకుండ్ సాహిబ్ రోప్ వే ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రధాని మోడీ అధ్యక్షతన బుధవారం (మార్చి 5) జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఈ రెండు ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. ఈ మేరకు కేబినెట్ భేటీ వివరాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం కేదార్‌నాథ్, హేమకుండ్ సాహిబ్ అనే రెండు రోప్‌వే ప్రాజెక్టులకు

వివరాలు 2లో..

## ఐదేళ్లు అధికారం ఇస్తే గాడిదలు కాశారా?



- పోలవరం ప్రాజెక్టు నిర్వీర్యం చేసే కుట్రలో చంద్రబాబు భాగస్వామి అంటూ షర్మిల వ్యాఖ్యలు
- ఈ కుట్రకు కర్త, కర్మ, క్రియ జగనే అంటూ విమర్శలు
- పోలవరంపై మాట్లాడే నైతిక అర్హత వైసీపీకి లేదని స్పష్టీకరణ

**పెన్ పవర్ డెస్క్:** పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేసే కుట్ర లో చంద్రబాబు భాగస్వామి అయితే... కర్త, కర్మ, క్రియ జగనే అని ఏపీ కాంగ్రెస్

వివరాలు 2లో..

## చంద్రబాబు చేతికింది మనుషులను తెలంగాణ సలహాదారుగా నియమించారు

- ఏపీకి పని చేసిన వ్యక్తిని తెలంగాణకు నియమిస్తే న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్న
- కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ వరప్రదాయిని అన్న హరీశ్ రావు
- కాళేశ్వరం ప్రాజెక్టు కుంగితే రంగనాయకసాగర్‌లోకి నీరు ఎలా వచ్చిందని ప్రశ్న



**పెన్ పవర్ డెస్క్:** చంద్రబాబునాయుడి చేతి కింది మనుషులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు తెలంగాణ రాష్ట్ర నీటి సలహాదా రులుగా నియమించారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శిం చారు. 2014 నుండి 2019 వరకు చంద్ర బాబు ఏపీ ముఖ్యమంత్రిగా ఉన్న సమ యంలో ఆ రాష్ట్రానికి నీటి పారుదల

వివరాలు 2లో..

## జగన్ ను క్షమించి వదిలేస్తున్నాం.... అసెంబ్లీలో కీలక ప్రకటన చేసిన స్పీకర్

- ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానన్న జగన్
- కనీసం 18 మంది ఎమ్మెల్యేలు ఉంటే తప్ప ప్రతిపక్ష హోదా రాదన్న అయ్యన్న
- జగన్ అన్నీ తెలిసే అబద్ధాలు ఆడుతున్నాడని ఆగ్రహం



**పెన్ పవర్ డెస్క్:** తనకు ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని వైసీపీ అధినేత జగన్ చెబుతున్న సంగతి తెలిసిందే. ప్రతిపక్ష నేత హోదా ఉంటేనే సభలో ఎక్కువ సమయం మాట్లాడే అవకాశం ఉంటుం దని ఆయన అంటున్నారు. ఈ నేపథ్యంలో, జగన్ కు ప్రతిపక్ష నేత హోదా అంశంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు.

వివరాలు 2లో..

## రామ్ గోపాల్ వర్మకు మరోసారి సీఐడీ అధికారుల నోటీసులు

- 'కమ్మ రాజ్యంలో కడప రెడ్లు' సినిమాకు సంబంధించి కేసు
- వర్మకు సీఐడీ అధికారులు మరోసారి నోటీసులు ఇచ్చిన వైనం
- ఈ కేసులో ఇంతకుముందు జారీ అయిన నోటీసులపై తెలంగాణ హైకోర్టులో వర్మ పిటిషన్
- కేసు ట్రయల్ కొనసాగుతుండగానే ఆర్‌జీవీకి సీఐడీ నుంచి మరోసారి నోటీసులు

వివరాలు 2లో..




## యుద్ధానికి సిద్ధమే.. ట్రంప్ తీరుపై చైనా రియాక్షన్

**పెన్ పవర్ డెస్క్:** ట్రంప్ తారీఫ్ ప్రకటనలపై సీరియస్‌గానే తీసుకుంది.. అమెరి కా యుద్ధానికి సిద్ధమవుతోందని ఆరోపిస్తోంది.. అదే గనక జరిగితే మేం కూడా యుద్ధానికి సిద్ధం అని ప్రకటించింది.

వివరాలు 2లో..



## ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు పేరును ప్రకటించిన పవన్ కల్యాణ్

- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయనున్న నాగబాబు
- నాగబాబుకు మంత్రి పదవి ఇస్తామని ఇప్పటికే ప్రకటించిన చంద్రబాబు
- నాగబాబు మంత్రి కావడం ఇక లాంఛనమే



**పెన్ పవర్ డెస్క్:** జనసేన నాయకుడు కొణిదెల నాగబాబు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడంలో ఫుల్ క్లారిటీ వచ్చింది. కూటమి అభ్యర్థిగా ఆయన ఎమ్మెల్యే కోటా

వివరాలు 2లో..

## 'అన్నదాత సుఖీభవ' పథకంపై కీలక ప్రకటన చేసిన అచ్చెన్నాయుడు




- మే నుంచి 'అన్నదాత సుఖీభవ' పథకాన్న అమలు చేస్తామన్న అచ్చెన్నాయుడు
- అర్హత కలిగిన రైతులకు రూ. 20 వేలు ఇస్తామని వెల్లడి
- రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని వ్యాఖ్య

**పెన్ పవర్ డెస్క్:** మే నెల నుంచి 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని అమలు చేస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అర్హత కలిగిన రైతులందరికీ రూ. 20 వేల నగదు అందజేస్తామని చెప్పారు. కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' అమలుపై విధివిధానాలను ఖరారు చేస్తున్నామని తెలిపారు. రైతులను గత వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందని... కూటమి ప్రభుత్వం రైతులకు అండగా

వివరాలు 2లో..

## ఎంపీ స్థానాల పునర్విభజనపై హీరో విజయ్ ఆందోళన



- జనాభా లెక్కల ఆధారంగా ఎంపీ స్థానాల పునర్విభజన చేయాలనుకుంటున్న కేంద్రం
- దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న విజయ్
- యూపీ, బీహార్ వంటి రాష్ట్రాల్లో స్థానాలు పెరిగితే సహించబోమని హెచ్చరిక

వివరాలు 2లో..

## ఢిల్లీలో అమిత్ షా, నిర్మలా సీతారామన్ లను కలిసిన సీఎం చంద్రబాబు

- ఢిల్లీ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- కేంద్రమంత్రులతో వరుస భేటీలు
- రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై వారితో చర్చ
- చంద్రబాబు వెంట రాష్ట్ర ఎంపీలు



**పెన్ పవర్ డెస్క్:** ఏపీ ముఖ్యమంత్రి చంద్ర బాబు ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. ఢిల్లీ ఎయిర్ పో ర్టులో ఆయనకు టీడీపీ ఎంపీలు స్వాగతం పలి కారు. అనంతరం చంద్ర బాబు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర ఆర్థిక శాఖ మం త్రి నిర్మలా సీతారామన్ లను కలిశారు. ఏపీకి చెందిన పలు అంశాలపై వారితో చర్చించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, విభజనకు సంబంధించిన పెండింగ్ అంశాలు, అమరావతి,

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ఆగని మల్టీ మార్కెటింగ్ మోసాలు

పెట్టుబడి తక్కువ.. లాభాలు ఎక్కువ! తక్కువ టైమ్‌లో.. ఎక్కువ ఆదాయం! ఇంట్లో నుంచే.. బీరువాల నిండా సంపాదించండి! ఇలాంటి ప్రకటనలతో.. ముందూ వెనకా ఆలోచించకుండా.. అత్యాశకు పోయి ఎంతో మంది భారీగా నష్టపోతున్నారు. నెట్‌వర్కింగ్ పేరుతో కొందరు కేటుగాళ్లు నట్టేట ముంచేస్తున్నారు. బిజినెస్, ప్రొడక్ట్, మార్కెటింగ్ అంటూ తెలివిగా మోసం చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో.. ఈ తరహా మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలు పెరిగిపోయాయ్. ఇప్పటికైనా మేలుకోని.. తేరుకోకపోతే.. భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్నారు.తక్కువ టైంలో ఎక్కువ లాభాలు ఆర్జించొచ్చు. ఎంతమంది ఏజెంట్లని చేర్పిస్తే అన్ని రివార్డులు, పాయింట్లు, రిఫర్ చేస్తే బోనస్‌లు వస్తాయని ఆశ చూపే దందాలు ఈ మధ్యకాలంలో ఎక్కువైపోయాయ్. కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. ఈ దేశంలో మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోసాలు మళ్లీ పెరుగుతున్నాయ్. వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులు, హెర్బల్ ప్రొడక్ట్స్, హెల్త్ కేర్ ఉత్పత్తులు, క్రిప్టో కరెన్సీ, నిత్యవసర వస్తువులు, ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్స్, ఎలక్ట్రిక్ బైకుల అమ్మకాల పేరిట అడ్డంగా మోసం చేస్తున్నారు. పిరమిడ్ మోడల్ తరహా మోసాలు చేసే కేటుగాళ్లంతా.. ఇప్పుడిదే పనిలో ఉన్నారు. తమ దగ్గర ప్రొడక్టులు కొని మార్కెట్‌లో విక్రయిస్తే.. భారీ లాభాలు వస్తాయని చెప్పి.. జనం ఆశల్ని, అమాయకత్వాన్ని క్యాష్ చేసుకునే ఏజెంట్లు ఎందరో ఉన్నారు.వి-కెన్, ఆమ్‌వే, క్యూ నెట్, వెస్టీజ్, హెర్బల్ లైఫ్, సంకల్ప్ మార్ట్, ఆఇజి టెక్నాలజీస్, ఫ్రైడే అప్ కన్సల్టెన్సీస్.. ఇలా చెప్పుకుంటూ పోతే లిస్ట్ చాంతాడంత ఉంటుంది. ఈ జాబితాలోనే ఇప్పుడు చేసింది ఏడీఎంఎస్ వ-బైక్స్.. ప్రతిసారీ కంపెనీ పేరు మారుతుంది. దాని బిజినెస్ మారుతుంది. అందులోని స్కీమ్ మారుతుంది కానీ.. స్కామ్ మాత్రం మారదు. అదే స్క్రిప్ట్, అదే సినిమా. అందులో క్యారెక్టర్స్ మారతాయి కానీ.. మోడల్ మారదు. లైఫ్‌లో సక్సెస్ అయ్యేందుకు.. దీనిని మించిన అవకాశం మరొకటి లేదు.. రాదు అని కథలు చెబుతారు. మిమ్మల్ని మోటివేట్ చేస్తారు. బ్రెయిన్ వాష్ చేస్తారు.వాళ్ల దారిలోకి తెచ్చుకుంటారు. మనల్ని మోసం చేయడమే కాదు.. మన చేత మరో నలుగురైదుగురిని మోసం చేయమని చెబుతారు. డబ్బుల మీదున్న ఆశతో.. ఎంతో మంది అమాయకులు ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్ కంపెనీల ఏజెంట్లు చెప్పింది విని మోసపోతున్నారు. వాళ్లు చెప్పినట్లుగా చేస్తూ.. మిగతా వాళ్లు కూడా నష్టపోయేందుకు కారకులవుతున్నారు. ఇలా.. వందల కోట్లలో వసూలు చేసి.. బోర్డు తిప్పేసిన కంపెనీల లిస్టు చాలానే ఉంది. ఈజీగా మనీ వస్తుందని ఆశపడితే.. తర్వాత నష్టపోవాల్సిందే మీరేనని మార్కెట్ నిపుణులు, పోలీసులు హెచ్చరిస్తున్నారు.ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్ మోడల్‌లో.. కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన స్కామే.. ఏడీఎంఎస్ ఈ-బైక్స్. బైక్‌ల పేరుతో వ్యాపారం మొదలుపెట్టిన కంపెనీ.. ఆ బైక్‌లు అమ్మకుండా.. చైన్ మార్కెటింగ్ వ్యాపారం చేస్తోంది. రిజిస్ట్రేషన్, మెంబర్‌షిప్, ఐడీ జనరేషన్ అని చెబుతూ.. జనాల నుంచి డబ్బులు వసూలు చేసి.. వారినే మార్కెటింగ్ ఏజెంట్లుగా మార్చేస్తోంది. జనం డబ్బుతో.. వాళ్లు వ్యాపారం చేస్తూ.. వేల కోట్లు వెనకేస్తున్నారు. కొద్దో గొప్ప డబ్బులకు ఆశపడి.. ఈ స్కీమ్‌లో ఏజెంట్లుగా చేరుతున్న వాళ్లెందరో ఉన్నారు.ఎప్పుడైతే.. సైబర్ మోసాలపై జనంలో అవగాహన పెరగడం మొదలైందో.. కేటుగాళ్లంతా ఈ మల్టీ లెవెల్ మార్కెటింగ్‌పై కన్నేశారు. చైన్ బిజినెస్ పేరుతో.. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ ద్వారా ప్రకటనలు గుప్పించి.. అమాయకులను మోసగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మల్టీలెవెల్ మార్కెటింగ్ స్కీములు నడిపే కేటుగాళ్లలో.. చాలా మంది మంది విదేశాల్లోనే ఉండి ఈ పిరమిడ్ రాకెట్ నడుపుతుంటారు. భారీ లభాలతో పాటు లగ్జరీ కార్లు, ఫారిన్ టూర్ల పేరిట.. ఏజెంట్ల ద్వారా అమాయకులకు వల వేస్తున్నారు.ఈ మల్టీలెవెల్ మార్కెటింగ్ మోసాలన్నీ.. స్టాలిన్ సినిమా తరహాలోనే ఉంటాయ్. నువ్వో ముగ్గురికి సాయం చెయ్.. ఆ ముగ్గురిని మరో ముగ్గురి చొప్పున సాయం చేయమని చెప్పండి లాగే ఉంటుంది వ్యవహారం. ఇలా చైన్ సిస్టమ్ ద్వారా డబ్బులు కట్టించుకోవడం, పెద్ద మొత్తంలో జమ అయ్యాక జెండా పీకేయడం ఎన్నో ఏళ్లుగా జరుగుతున్నదే! ఇప్పుడు.. ఈ-బైక్స్ పేరుతో ఏడీఎంఎస్ చేస్తున్నది కూడా ఇదే దందా. కొన్ని కంపెనీలు తమ దగ్గర ప్రొడక్ట్స్ కొని.. మార్కెట్‌లో సేల్ చేసుకోమని చెబుతాయ్. ఇంకొన్ని.. కచ్చితంగా ప్రతి నెలా తమ ఉత్పత్తుల్ని కొనాల్సిందే అంటాయ్. తర్వాత.. మిగతా వాళ్లని కూడా చేర్పించమని చెబుతాయ్. కానీ.. ఏడీఎంస్ అలా కాదు.మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీమ్స్ చాలా డిఫరెంట్‌గా ఉంటాయ్. ఈ కంపెనీలు.. తమ డైట్ సప్లిమెంట్ల నుంచి క్లీనింగ్ ప్రొడక్ట్స్ వరకు ఏవైనా జనం భారీగా కొనుగోలు చేసే అవకాశం కల్పిస్తాయ్. ఆ తర్వాత వీటిని సేల్ చేయడం ద్వారా ప్రజలు ఆదాయాన్ని సంపాదించే వీలుందని చెబుతాయి. నిజానికి ఇలాంటి కొన్ని స్కీమ్‌లలో భారీగా ఏజెంట్లను నియమించుకోవడం ద్వారా కంపెనీలు డబ్బులు సంపాదిస్తూ ఉంటాయ్. కింది స్థాయిలో జనం పెట్టే డబ్బు ద్వారానే.. పైస్థాయిలో ఉండేవారికి లాభాలు వస్తుంటాయ్.అయితే.. అతి తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని ఎవరైనా చెబితే.. కచ్చితంగా అది మోసమేనని గ్రహించాలి. లేకపోతే.. మిమ్మల్ని ఆ స్కామ్‌లోకి దించి.. మీ డబ్బులు కొల్లగొడతారు. అత్యాశకు పోతే మోసపోవడం ఖాయం. ఈ చైన్ మార్కెటింగ్‌లో.. ముందు చేరిన వారికే లాభాలు వస్తాయి. ఆ తర్వాత చేరిన వారంతా తీవ్రంగా నష్టపోవాల్సిందే. అందువల్ల.. ఇలాంటి నెట్‌వర్క్‌ల్లో ఎవరూ చేరొద్దు. ఆ కంపెనీలు పెట్టే మీటింగ్‌లకు కూడా వెళ్లొద్దు. ముఖ్యంగా సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలి. మోసపూరిత ప్రకటనలకు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు పోలీసులు. పిరమిడ్ విధానంలో చేసే మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీమ్‌ల్లో.. మొదట జాయిన్ అయిన వారికే డబ్బులొస్తాయని చెబుతున్నారు. కొన్నాళ్ల తర్వాత.. చివరికి జాయిన్ అయినవారు పెద్ద ఎత్తున నష్టపోతారని హెచ్చరిస్తున్నారు.ఒకప్పుడు వారం స్కీములు, నెలవారీ లాటరీలు అంటూ మోసం చేసేవారు. మాయమాటలు చెప్పి డబ్బులు కట్టించుకునేవారు. తర్వాత.. పెద్ద మొత్తంలో జమవగానే ఆ సొమ్ముతో ఉడాయించేవారు. ఇప్పుడు.. రోజులు మారాయ్. టెక్నాలజీ పెరిగింది. అంతా హైలెవెల్ మార్కెటింగ్ మోసాల ట్రెండ్ నడుస్తోంది. తక్కువ పెట్టుబడి.. ఎక్కువ సంపాదన! కూర్చున్న చోటే.. కాసుల వర్షం! లాంటి ఏదో ఒక స్కీమ్ పేరుతో.. భారీ స్కామ్‌లకు పాల్పడుతున్నారు కేటుగాళ్లు. అందువల్ల.. మల్టీ లెవెల్ మార్కెటింగ్ బిజినెస్‌ల జోలికి వెళ్లొద్దని నిపుణులు సూచిస్తున్నారుఇలా నిబంధనలకు విరుద్ధంగా నడిచే ఈ విధమైన స్కీమ్‌లకు వ్యతిరేకంగా ఎన్నో చట్టాలున్నాయ్. ప్రధానంగా.. సెమీ అర్బన్, రూరల్ ఏరియాల్లోని ప్రజల్ని ఆకర్షించి ఈ స్కీముల్లో జాయిన్ చేస్తున్నారు. హోటల్స్, ఫంక్షన్ హాల్స్‌లో మీటింగ్స్ ఏర్పాటు చేసి.. వీటి గురించి చెబుతుంటారు. ఇలాంటి స్కీముల్లో ఎవరూ చేరొద్దు. ఒకవేళ మీ దగ్గరలో ఇలాంటి మీటింగులు జరిగితే.. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి.

# రామ్ గోపాల్ వర్మకు మరోసారి సీఐడీ అధికారుల నోటీసులు

వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు సీఐడీ అధికారులు మరోసారి నోటీసులు పంపారు. 2019లో ఆయన తీసిన 'కమ్మ రాజ్యంలో కడప రెడ్లు' మూవీపై అనకాపల్లి, మంగళగిరి, ఒంగోలులో కేసులు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసులో విచారణకు హాజరు కావాలని ఇవాళ సీఐడీ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు.

అయితే, ఈ కేసులో ఇంతకుముందు జారీ అయిన నోటీసులపై ఆయన తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశారు. ప్రస్తుతం ఈ కేసు న్యాయస్థానంలో విచారణ దశలో ఉండగానే... ఆర్జీవీకి సీఐడీ నుంచి ఇప్పుడు మరోసారి నోటీసులు అందాయి. ఇక ఈ కేసుకు సంబంధించి వర్మకు గుంటూరు సీఐడీ అధికారులు గత నెల 10న నోటీసులు జారీ చేశారు. కానీ, ఆయన విచారణకు డుమ్మా కొట్టి, తన న్యాయవాదిని సీఐడీ ఆఫీస్‌కు పంపించారు. సినిమా పనులతో బిజీగా ఉన్నందున విచారణకు రాలేనని, తనకు 8 రోజుల గడువు కావాలని కోరారు. కానీ, ఈరోజు వర్మకు సీఐడీ అధికారులు మరోసారి నోటీసులు పంపించడం గమనార్హం.

**వర్మపై అసలు కేసు ఏంటంటే..!**

2019లో 'కమ్మ రాజ్యంలో కడప రెడ్లు' పేరుతో ఒక సినిమాను తెరకెక్కించారు. అయితే ఈ చిత్రం టైటిల్ పై కొందరు తెలంగాన హైకోర్టులో పిటిషన్ వేశారు. దీంతో 'అమ్మ రాజ్యంలో కడప బిడ్డలు' అనే పేరుతో సినిమాను రిలీజ్ చేశారు. అయితే, యూట్యూబ్ లో మాత్రం 'కమ్మ రాజ్యంలో కడప రెడ్లు' పేరుతోనే విడుదల చేశారంటూ మంగళగిరి సమీపంలోని ఆత్మకూరుకు చెందిన బండారు వంశీకృష్ణ సీఐడీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సినిమాలోని అభ్యంతరకర సన్నివేశాలను కూడా తొలగించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ మనోభావాలు దెబ్బతినేలా సినిమా తీశారని చెప్పారు. దీంతో మంగళగిరిలోని సీఐడీ పోలీస్ స్టేషన్ లో గతేడాది నవంబర్ 29న కేసు నమోదయింది. ఈ క్రమంలో ఆర్జీవీకి సీఐడీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈ కేసులో వర్మ విచారణకు హాజరు కావాల్సి ఉండగా... ఆయన డుమ్మా కొట్టి గడువు కోరారు.

## చంద్రబాబు చేతికింది మనుషులను తెలంగాణ సలహాదారుగా నియమించారు

- మొదటి పేజీ తరువాయి

కార్యదర్శిగా ఉన్న వ్యక్తిని ఈరోజు తెలంగాణకు సలహాదారుగా నియమిస్తే మనకు న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. ఆయన సిద్దిపేట నియోజకవర్గం చిన్నకోడూరు మండలం చంద్లపూర్‌లోని రంగనాయకసాగర్ ప్రాజెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయిని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిందని చెప్పిన వారు ఈ నీరు ఎలా వచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. రంగనాయకసాగర్‌లోకి కాళేశ్వరం పంప్ హౌస్‌ల ద్వారా నీటిని విడుదల చేసినందుకు ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. పంట ఎండిపోతుందని తాను విజ్ఞప్తి చేయగా, తన విన్నపం మేరకు ఒక టీఎంసీ నీటిని విడుదల చేశారని తెలిపారు.

గత ప్రభుత్వం చేసిన మంచి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం తుడిచిపెట్టాలని చూస్తోందని విమర్శించారు. అధికారంలో ఎవరు ఉన్నా ప్రజలకు నష్టం చేయకూడదని హితవు పలికారు. కాళేశ్వరం అంతా బాగుందని, మేడిగడ్డలో ఏడు బ్లాకులు ఉంటే ఒక బ్లాక్‌లో మాత్రమే పిల్లర్ కుంగిపోయిందని చెప్పారు. కానీ గోరంతను కొండంత చేసి బురదజల్లే ప్రయత్నం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 15 నెలలు అవుతోందని, ఇప్పటికైనా పెండింగులో ఉన్న పంట కాలువలను పూర్తి చేయాలని సూచించారు.

## యుద్ధానికి సిద్ధమే.. ట్రంప్ తీరుపై చైనా రియాక్షన్

- మొదటి పేజీ తరువాయి

ఇదే విషయంపై అమెరికాలోని చైనా ఎంబసీ సంచలన పోస్టును షేర్ చేసింది. యుద్ధానికి మేం సిద్ధం అందులో రాసింది. ట్రంప్ నుంచి టారిఫ్ పెంపు ప్రకటన వచ్చిన వెంటనే చైనా ఎంబసీ ఈ మేసేజ్ ను పోస్ట్ చేసింది. మేం దేనిలో తక్కువ కాదు.. అమెరికా కోరుకుంటే మేం యుద్ధానికైనా సిద్ధంగా ఉన్నామని కుండబద్దలు కొట్టింది. అమెరికా నిజంగా అక్రమ వలసల సమస్య, డ్రగ్స్ నియంత్రణ సమస్యను పరిష్కరించాలనుకుంటే నేరుగా చైనాతో సంప్రదించాలి.. అలా కాకుండా తారీఫ్ లను పెంచడం ఏంటీ.. యూఎస్ కోరుకుంటున్నది యుద్ధమే అయితే అది తారిఫ్ వార్ కావచ్చు..ట్రేడ్ వార్ కావచ్చు ఇంకేదైనా కావచ్చు..మేం చివరి వరకు పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని %శ%లో మేసేజ్ షేర్ చేసింది. మరోవైపు చైనా విదేశాంగ మంత్రి కూడా ట్రంప్ తీరుపై తీవ్రంగానే స్పందించారు. చైనా దిగుమతులపై తారీఫ్ లను పెంచేందుకు అమెరికా అక్రమ వలసల సమస్యను ట్రంప్ ఓ సాకుగా చూపిస్తున్నారని అన్నారు. దేశం హక్కులు, ప్రయోజనాలను రక్షించుకునేందుకు మేం తీసుకుంటున్న నిర్ణయాలు సరైనవే అని చెప్పారు. ఫెంటానిల్ సంక్షోభం పరిష్కారానికి మానవత్వం, అమెరికా ప్రజల పట్ల సద్భావనతో యూఎస్ కు సహాయం చేసేందుకు మేం చర్యలు చేపట్టాం.. దానిని గుర్తిం చకుండా చైనాపై నిందలు మోపడానికి ప్రయత్నిస్తోంది. సుంకాలు పెంచుతూ చైనాపై ఒత్తిడి తెచ్చేందుకు, బ్లాక్ మెయిల్ చేసేందుకు యత్నిస్తోందని అన్నా రు. యూఎస్ కు సహాయం చేసినందుకు మమ్మల్ని శిక్షిస్తున్నారు.. ఇలా అయితే యూఎస్ సమస్య పరిష్కారం కాదు.. ఇరు దేశాల మధ్య కౌంటర్ నార్కోటిక్ సహకారం దెబ్బతింటుందని అన్నారు. ట్రంప్ అధికారం చేపట్టాక చైనాపై సుంకాల యుద్ధం మొదలు పెట్టారు. చైనా వస్తువులపై ఇప్పటికే ఉన్న 10 శాతం కంటే అదనంగా మరో 10 శాతం సుంకాలను ట్రంప్ ప్రభుత్వం విధించింది. కెనడా ,మెక్సికోలతో పాటు చైనాలో కూడా కొత్త టారిఫ్‌లు ప్రారంభమయ్యాయి.అయితే చైనా కూడా అమెరికాకు ధీటుగా దిగుమతి సుంకాలు పెంచేసింది.అమెరికానుంచి చైనాకు ఎగుమతి చేసే వ్యవసాయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు పెం చింది. సోయాబీన్స్, మొక్కజొన్న నుంచిపాల ఉత్పత్తులు, గొడ్డు మాంసం వరకు వ్యవసాయ ఉత్పత్తులపై 10 శాతం,15 శాతం మధ్య అదనపు సుంకాలను విధిం చనున్నట్లు చైనా ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ట్రంప్ తారీఫ్ ప్రకటనలపై చైనా సీరియస్ గానే తీసుకుంది.. అమెరికా యుద్ధానికి సిద్ధమవుతోందని ఆరోపిస్తోంది.. అదే గనక జరిగితే మేం కూడా యుద్దానికి సిద్ధం అని ప్రకటించింది. ఇందులో భాగంగా బుధవారం (మార్చి5) అమెరికాలోని చైనా ఎంబసీ సంచలన పోస్టును షేర్ చేసింది. మేం దేనిలో తక్కువ కాదు.. అమెరికా కోరుకుంటే మేం యుద్ధానికైనా సిద్ధంగా ఉన్నామని కుండబద్దలు కొట్టింది.

# అమెరికాకు కెనడా వార్నింగ్

- మొదటి పేజీ తరువాయి

100 మిలియన్ డాలర్ల డీల్ ను రద్దు చేస్తున్నట్టు ఒంటారియో ప్రీమియర్ డగ్ ఫోర్డ్ ప్రకటించారు.తాము ఆర్థికంగా దెబ్బతినేలా చేస్తామంటే చూస్తూ కూర్చోబోమని డగ్ ఫోర్డ్ అన్నారు. ఒంటారియోను ధ్వంసం చేస్తామంటే చూస్తూ కూర్చోనని... చిరునవ్వుతో చేయాల్సిందంతా చేస్తానని చెప్పారు. ఒంటారియాతో స్టార్ లింక్ కు ఉన్న 100 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని రద్దుచేయడం పూర్తయిందని తెలిపారు. తమ స్టోర్ల నుంచి అమెరికా ఆల్కహాల్ ను తొలగించాలని యోచిస్తున్నామని చెప్పారు. స్టార్ లింక్ డీల్ కింద తొలుత 15 వేల ఇళ్లు, వాణిజ్య సముదాయాలకు ఇంటర్నెట్ సదుపాయం అందించాల్సి ఉంది.

చిరకాల మిత్ర దేశమైన కెనడాపై ట్రంప్ సుంకాలు ఎందుకు విధిస్తున్నారని డగ్ ఫోర్డ్ ప్రశ్నించారు. అమెరికాకు అత్యధిక ఇంధన ఎగుమతులు కెనడా నుంచే వెళుతున్నాయని, వారు తమ ఇంధనంపై ఆధారపడి ఉన్నారని, వాళ్లు కూడా నొప్పి అనుభవించాలని అన్నారు. సన్నిహిత మిత్రులు, పొరుగు వారిపై ట్రంప్ ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని చెప్పారు. కెనడాపై సుంకం విధించడం అంటే అమెరికన్లపై పన్ను విధించడం కిందకే వస్తుందని అన్నారు.

# కేదార్‌నాథ్ రోప్‌వేకి కేంద్ర కేబినెట్ ఆమోదం

- మొదటి పేజీ తరువాయి

ఆమోదం తెలిపిందని ఆయన చెప్పారు.

జాతీయ రోప్‌వేస్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ -పర్వతమాల పరియోజన కింద ఉత్తరాఖండ్‌లోని సోన్‌ప్రయాగ్ నుంచి కేదార్‌నాథ్ వరకు 12.9 కి.మీ పొడవైన రోప్‌వే ప్రాజెక్ట్ అభివృద్ధికి కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఈ ప్రాజెక్టు కోసం కేంద్రం రూ.4,081 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. సోన్ మార్గ్ కేదార్ నాథ్ రోప్ వే ప్రాజెక్ట్ పూర్తి అయితే.. కేదార్ నాథ్ చేరుకునేందుకు సమయం గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం సోన్ మార్గ్ నుంచి కేదార్ నాథ్ వెళ్లడానికి 8 నుంచి 9 గంటల సమయం పడుతుండగా.. అదే ఈ రోప్ వే ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే కేవలం 36 నిమిషాల్లో కేదార్ నాథ్ చేరుకోవచ్చని తెలిపారు.

ఆస్ట్రియా, ఫ్రాన్స్ నిపుణుల సహాయంతో ఈ ప్రాజెక్ట్ కంప్లీట్ చేస్తామన్నారు. అలాగే.. హేమకుండ్ సాహిబ్ రోప్ వే ప్రాజెక్టు కూడా కేంద్రం ఆమోద ముద్ర వేసిందని చెప్పారు అశ్వినీ వైష్ణవ్. 12.4 కి.మీ. పొడవైన ఈ రోప్ వే ప్రాజెక్టు హేమకుండ్ సాహిబ్‌ను గోవింద్ ఘాట్‌తో కలుపుతుందని.. ఈ ప్రాజెక్టుకు రూ.2,730.13 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జాతీయ రోప్‌వేస్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ - పర్వతమాల పరియోజనలో భాగంగా ఈ ప్రాజెక్ట్ అభివృద్ధి చేపట్టామని అన్నారు.

## జగన్ ను క్షమించి వదిలేస్తున్నాం.... అసెంబ్లీలో కీలక ప్రకటన చేసిన స్పీకర్

- మొదటి పేజీ తరువాయి

కనీసం 18 మంది ఎమ్మెల్యేలు ఉంటే తప్ప ప్రతిపక్ష హోదా రాదని చట్టం చెబుతోందని అయ్యన్నపాత్రుడు తన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్ష హోదా కోసం జగన్ తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. సభాపతికి దురుద్దేశాలు ఆపాదించడం అంటే సభా నియమావళి ఉల్లంఘన కిందకే వస్తుందని స్పష్టం చేశారు. జగన్ అన్నీ తెలిసే అబద్ధాలు ఆడుతున్నారని, ఆయనను క్షమించి వదిలేస్తున్నామని తెలిపారు. జగన్ మాటలను ప్రేలాపనలుగా భావిస్తున్నామని అన్నారు.

## పవన్ కు వచ్చిన మెజారిటీ ఎంత, జగన్ కు వచ్చిన మెజారిటీ ఎంత?

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్రంలో పరదాల అమ్మకాలు తగ్గాయట అని మంత్రి నారా లోకేశ్ వ్యంగ్యం ప్రదర్శించారు. ఇక, వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వకూడదు అన్నది ప్రజలే నిర్ణయించారు... ఈ విషయం జగన్ కు ఎందుకు అర్థం కావట్లేదు? అని లోకేశ్ ప్రశ్నించారు. ప్రజలు ఇవ్వని ప్రతిపక్ష హోదా గురించి జగన్ సీఎంను కించపరిచేలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తనను తల్లి, చెల్లి కూడా నమ్మట్లేదని జగన్ ఇంకా గ్రహించడంలేదు అని వ్యాఖ్యానించారు. 11 సీట్లు ఎందుకు వచ్చాయో జగన్ ఓసారి ఆత్మ పరిశీలన చేసుకుంటే మంచిదని అన్నారు.

## ఎమ్మెల్సీ అభ్యర్థిగా నాగబాబు పేరును ప్రకటించిన పవన్ కల్యాణ్

- మొదటి పేజీ తరువాయి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. ఆయన పేరును జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారికంగా ప్రకటించారు. తద్వారా నాగబాబు రాజ్యసభకు వెళతారని, కార్పొరేషన్ ఛైర్మన్ అవుతారని జరుగుతున్న ప్రచారానికి జనసేన ముగింపు పలికింది. నాగబాబు పేరును మంత్రిగా గతంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన సంగతి తెలిసిందే. కూటమికి అసెంబ్లీలో ఫుల్ మెజార్టీ ఉండటంతో మొత్తం ఐదు ఎమ్మెల్సీ స్థానాలను కూటమి గెలుచుకునే అవకాశాలు ఉన్నాయి.

## ఐదేళ్లు అధికారం ఇస్తే గాడిదలు కాశారా?

- మొదటి పేజీ తరువాయి

అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టుపై మాట్లాడే నైతిక అర్హత వైసీపీకి లేదని స్పష్టం చేశారు. ఐదేళ్లు అధికారం ఇస్తే గాడిదలు కాశారా? ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు కుదించే ప్రతిపాదనకు ఒప్పుకున్నది మీరు కాదా? అని నిలదీశారు. నాడు ప్రధానమంత్రికి రాసిన లేఖల్లోనూ 41.15 మీటర్లకు నిధులు విడుదల చేయాలని కోరింది మీరు కాదా? అని ప్రశ్నించారు. మరోవైపు, పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గింపుపై కూటమి ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా పచ్చి అబద్ధాలు చెబుతూ, మసి పూసి మారేడు కాయ చేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. 41.15 మీటర్ల ఎత్తు... రూ.30,436 కోట్ల బడ్జెట్ అంచనాలకు కేంద్రం ఆమోద ముద్ర వేస్తే.... 45.72 మీటర్ల ఎత్తుతో ప్రాజెక్టు కడతామని అసెంబ్లీ వేదికగా కూటమి ప్రభుత్వం చెబుతున్నవి అవాస్తవాలు కాదా? అని షర్మిల ప్రశ్నించారు. ఎత్తు తగ్గింపు విషయం అవాస్తవం అయితే దానిపై కేంద్రంతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు.

## 'అన్నదాత సుఖీభవ' పథకంపై కీలక ప్రకటన చేసిన అచ్చెన్నాయుడు

- మొదటి పేజీ తరువాయి

ఉంటుందని చెప్పారు. వైసీపీ పాలనలో వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. భూసార పరీక్షలు లేవు, వ్యవసాయ యంత్రాలు లేవు, పంటల బీమా చెల్లింపులు లేవని దుయ్యబట్టారు. తాము రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు. శాసనమండలిలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.మరో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్ర'లో భారీ అవినీతి జరిగిందని చెప్పారు. ఈ విషయాన్ని లోతుగా పరిశీలించడానికి ఒక ఇండిపెండెంట్ కమిటీతో విచారణ వేసి 45 రోజుల్లో నివేదిక సమర్పిస్తామని తెలిపారు.

## ఢిల్లీలో అమిత్ షా, నిర్మలా సీతారామన్ లను కలిసిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

పోలవరం తదితర అంశాలపై కేంద్రమంత్రులతో మాట్లాడారు. ఈ పర్యటనలో చంద్రబాబు వెంట కేంద్రమంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు సీఎం రమేశ్, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఎంపీ స్థానాల పునర్విభజనపై హీరో విజయ్ ఆందోళన

**పెన్ పవర్ డెస్క్:** లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్ర ప్రభుత్వానికి, పలు రాష్ట్రాల్లోని పార్టీలకు మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. ఇదే అంశంపై తమిళ స్టార్ హీరో, తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత విజయ్ స్పందిస్తూ.... పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు పార్లమెంట్ లో ప్రాతినిధ్యం తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజనపై ఆయా రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని అన్నారు. జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన చేస్తే... పార్లమెంట్ లో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతుందని విజయ్ అన్నారు. దీన్ని ఎంతమాత్రం అంగీకరించబోమని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలన్నీ గత 50 ఏళ్లుగా జనాభా పెరుగుదలను నియంత్రించాయని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఎంపీ స్థానాలు తగ్గినా... యూపీ, బీహార్ వంటి రాష్ట్రాల్లో స్థానాలు పెరిగినా సహించేది లేదని హెచ్చరించారు. అన్ని పార్టీలతో కలిసి దీనిపై పోరాడతామని చెప్పారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

# అమరావతిలో మంత్రులను కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి





- నడిమి వంక, మరువ ప్రొటెక్షన్ వాల్ కి నిధులివ్వండి
- జలనవరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కు దగ్గుపాటి విజ్ఞప్తి
- బీసీ హాస్టల్స్ లో నూతన భవనాలు, మెస్, కాస్మోటిక్ చార్జీల అంశంపై మంత్రి సవితను మంత్రి సవితను కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి
- ఎమ్మెల్యే విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన మంత్రులు

**బ్యూరో రిపోర్ట్ పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ మార్చ్ 5.**

అనంతపురం నియోజకవర్గంలో సమస్యలపై రాష్ట్ర మంత్రులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కలిశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో అమరావతిలో ఉన్న ఆయన జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ని కలిశారు. నగరంలో గత కొన్నేళ్లుగా సమస్యగా మారిన నడిమి వంక ప్రొటెక్షన్ వాల్ నిర్మాణం నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతపురం నగరంతో పాటు రాప్తాడు నియోజకవర్గంలో భారీ వర్షాలు కురిసిన సమయంలో మరువ వంక, నడిమి వంకలకు పెద్ద ఎత్తున నీరు వస్తోందన్నారు. దీని వలన వరదనీరు కాలనీల్లోకి చొచ్చుకెళ్లి చాలా ఇళ్లు నీట మునుగుతున్నాయన్నారు. ఇప్పటికే ఇలాంటి పరిస్థితి ఇటీవల రెండు సార్లు జరిగిందన్నారు. అందుకే ఈరెండు కాల్వల చుట్టూ ప్రొటెక్షన్ వాల్ నిర్మించాలన్నారు. ఇందుకోసం మొత్తం 88కోట్ల రూపాయల వరకు రక్షణ గోడనిర్మాణానికి అవసరం అవుతుందన్నారు. ఈ మొత్తాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి నిమ్మల రామానాయుడు సానుకూలంగా స్పందించారు. విధులు వెంటనే వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యల గురించి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కలిశారు. అనంతపురము జిల్లా కేంద్రంకు జిల్లాలోని చాలా ప్రాంతాల వారు విద్యను అభ్యసించడానికి ఎక్కువ మంది పేద మధ్యతరగతి, వెనుకబడిన వర్గాలకు సంబంధించిన విద్యార్థులు వస్తున్నారన్నారు. వీరిలో ఎక్కువ మంది హాస్టల్లో ఉండి విద్యను అభ్యసిస్తున్నట్లు వివరించారు. అయితే గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్లో ఆవరణములో బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టల్స్ మూడు ఉన్నాయని అయితే అక్కడ భవనాలు పురాతనమైనవి కావడంతో వర్షాకాలం ప్రారంభం కాగానే వర్షపునీరు రావడం, పై పెచ్చులు ఊడిపోవడం వంటి సమస్యలు ఉన్నట్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులు సంఖ్యను దృష్టిలో ఉంచుకొని అదనపు భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా 7 నెలల నుంచి

మెస్,కాస్మోటిక్ చార్జీలు పెండింగ్ లో ఉండటం వలన వలన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా పోస్ట్ మెట్రిక్ 2 కోట్ల 3 లక్షల రూపాయలు, ప్రీ మెట్రిక్ కోటి 11 వేల రూపాయలు పెండింగ్ లో ఉన్నాయని.. వెంటనే వాటిని మంజూరు చేసి విద్యార్థులు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి చెప్పిన అంశాలను పరిగణలోకి తీసుకుంటామని.. వసతి గృహాల సమస్యల పరిష్కారం కోసం వెంటనే చర్యలు తీసుకుంటామని మంత్రి సవిత అన్నారు. పెండింగ్లో ఉన్న మెస్ కాస్మోటిక్ చార్జీలు త్వరలోనే విడుదలవుతాయని మంత్రి అన్నారు.

# జనసేన ఇంఛార్జి వినుత కోటా గారికి కలిసిన ఏర్పేడు మండలం, వికృతమాల పంచాయతీలో టిడ్కో ఇళ్ళ వాసులు




**( కాళహస్తి/మార్చ్ 5 పెన్ పవర్ ప్రతినిధి)**

తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కి చెందిన టిడ్కో ఇళ్లు ఏర్పేడు మండలం, వికృతమాల పంచాయతీలో కేటాయించడం జరిగింది. వారికి ఎలాంటి సదుపాయాలు గత ప్రభుత్వంలో కల్పించలేదని , చాలా వరకు ఇళ్లు కేటాయించలేదని , దాదాపు 1800 ఇళ్లు కట్టినా కూడా కనీస వసతులు లేవని టిడ్కో ఇళ్ళ వాసులు ఈరోజు రేణిగుంట లోని పార్టీ కార్యాలయం వద్ద జనసేన పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి శ్రీమతి వినుత కోటా గారిని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అక్కడ 7 బోర్లు ఉంటే కనీసం 2 కూడా పని చెయ్యడం లేదని, బస్ సౌకర్యం లేక స్కూల్ పిల్లలు 5 కి. మీ నడిచి వెళ్తున్నారని, వారి ప్రాంతంలో రేషన్ ఇవ్వడం లేదని, కొంత మందికి పెన్షన్ లు ఇవ్వడం లేదని, డ్రైనేజ్ కాలువలు లేవని తెలిపారు.

ఈ సమస్యలను తప్పక టిడ్కో చైర్మన్ శ్రీ వేముల పాటి అజయ్ కుమార్ గారికి, తిరుపతి ఎమ్మెల్యే గారికి, తిరుపతి మునిసిపల్ కమిషనర్ గారి దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామని వినుత గారు ప్రజలకి హామీ ఇవ్వడం జరిగింది. త్వరలో తిరుపతి ఎమ్మెల్యే గారితో కలిసి టిడ్కో ఇళ్లను పరిశీలిస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాయకులు మునికుమార్, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన గుణాత్మక విద్య అందడమే ప్రభుత్వ ఉద్దేశ్యం.



జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**పెన్ పవర్ కడప, మార్చి 5 :**

జీవో 117 ఉపసంహరణ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్య అందడమే కాకుండా.. వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయనుందని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.

బుధవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో.. జీవో 117 ఉపసంహరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే.. సన్నాహక మార్గదర్శకాలపై.. క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ, నివేదికల సమర్పణ తదితర అంశాలపై... సంబంధిత విద్యాశాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జీవో 117ను ఉపసంహరించిన తర్వాత అందుకు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చేందుకు అవసరమైన ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ ప్రారంభించిందన్నారు. అందులో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ ఇప్పటికే సన్నాహక మార్గదర్శకాలపై ఉత్తర్వులు కూడా విడుదల చేసిందన్నారు. 2 నెలల పాటు క్షేత్రస్థాయిలో కూడా సంబంధిత శాఖల అధికారులు, పాఠశాలల అభివృద్ధి కమిటీ ప్రతినిధులల్లి, పలువురు మేధావులతో అధ్యయనం చేలాట్టడం జరిగిందన్నారు. సంబందిత అధ్యయనానికి సంబంధించిన నివేదిక రిపోర్టును పరిగణలోకి తీసుకుని.. ప్రభుత్వం సూచించిన ప్రమాణికాల ఆధారంగా జిల్లాలోని పాఠశాలలలో కొంత మార్పును చేయడం జరుగుతుందన్నారు. ఆ తర్వాత కొత్తగా జారీచేసే జీవో ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. కాగా.. జీవో 117తో ప్రాథమిక విద్యావ్యవస్థకు నష్టం వాటిల్లుతుందని పలువురు ఉపాధ్యాయులు, మేధావులు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు.

కొత్త విధానంలో ఐదు రకాల పాఠశాలలను ప్రతిపాదించారు. శాటిలైట్ ఫౌండేషనల్ స్కూల్లో ప్రీప్రైమరీ 1, 2 తరగతులు ఉంటాయి. వీటిని మహిళా, శిశు సంక్షేమ శాఖ నడుపుతుంది. ఫౌండేషనల్ స్కూల్లో ప్రీప్రైమరీ 1, 2, 1–2 తరగతులుంటాయి. బేసిక్ ప్రైమరీ స్కూల్లో ప్రీప్రైమరీ 1, 2, 1– 5 తరగతులు ఉంటాయి. మోడల్ ప్రైమరీ స్కూల్లోనూ ప్రీప్రైమరీ 1, 2, 1–5 తరగతులుంటాయి. వీటిలో ప్రతి తరగతికి ఒక్కో టీచర్ చొప్పున ఉంటారు. ఉన్నత పాఠశాల్లో 6–10 తరగతులుంటాయి. ఇక ప్రాథమిక పాఠశాలల్లో వేటిని మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా మార్చాలో గుర్తించేందుకు మండల స్థాయి, క్లస్టర్ స్థాయిలో కమిటీలను నియమించడం జరిగిందిన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో, మున్సిపాలిటీ వార్డుల్లో ఈ స్కూళ్లను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

గత ప్రభుత్వంలో ఉన్నత పాఠశాల్లో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు వెనక్కి తీసుకురవడం జరుగుతోందన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6–8 తరగతుల విద్యార్థుల సంఖ్య 30, అంతకంటే తక్కువగా ఉంటే అక్కడి తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసి, దాన్ని ప్రాథమిక పాఠశాలగా మారుస్తారు. ఈ తరగతుల్లో విద్యార్థుల సంఖ్య 60, అంతకంటే ఎక్కువ ఉంటే ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 30 నుంచి 60 మధ్యలో ఉంటే బడిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటారన్నారు. అంతేకాకుండా కొత్త పాఠశాలలు, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్ల కేటాయింపులోనూ మార్పులు చేయనున్నారున్నారు.

జిల్లాలోని ప్రాథమికోన్నత పాఠశాలల స్థానంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు నిర్వహణలోకి వస్తాయి తప్ప.. ప్రాథమిక పాఠశాలల తరగతులు మారుతాయే తప్ప ఆ పాఠశాలలను మూసివేసి ప్రసక్తి వుండదన్నారు. ఈ అంశాన్ని గుర్తుంచుకొని విద్యార్థుల తల్లిదండ్రులకు పూర్తిస్థాయి వివరణలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం తీసుకోనున్న 117 రద్దు ద్వారా... అన్ని పాఠశాలలకు మంచి భవిష్యత్తు వుండనుందన్నారు. మంచి వాతావరణం, ఆహ్లాదకరమైన ఆరోగ్యకరమైన వాతావరణం, అనుకూలమైన మౌలిక సదుపాయాలు ఉన్న పాఠశాలలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా గుర్తించాలన్నారు.

జిల్లాలో బేసిక్ ప్రైమరీ పాఠశాలలను ప్రమోట్ చేస్తున్నారంటే... అందుకు సంబంధించి పూర్తి వివరాలను అందించాలన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని.. మనం తీసుకునే నిర్ణయాలు పిల్లలను నాణ్యమైన విద్యకు దగ్గర చేసే విధంగా ఉండాలన్నారు. పాఠశాల అభివృద్ధి కమిటీలు, మండల సమాఖ్య సభ్యులతో కులంకుశంగా మాట్లాడితేనే... సరైన నిర్ణయాలు బయటకు వస్తాయన్నారు. ప్రతి మహిళా సమాఖ్య సభ్యురాళ్లు కూడా దాదాపు తల్లుల బాధ్యతను పోషిస్తుంటారు కవట్టి.. పిల్లల ఆలనా పాలనా.. చదువు సంధ్య అనేవి ఆయా గ్రామాల్లోని కంటే తల్లులకే బాగా తెలుసునని గుర్తు చేశారు.

విలువలతో కూడిన గుణాత్మక విద్యను అందేంచే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ జీవోను ఉపసంహరించే యోచనలో ఉందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే.. అందరి అభిప్రాయాలను పరిగాణలోకి తీసుకుని విలువైన, న్యాయబద్ధమైన నిర్ణయాలు తీసుకుంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శంషీరుద్దున్, మండల విద్యాశాఖ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సంతృప్త స్థాయిలో ఆరోగ్య సేవలు అందించండి

## వైద్య ఆరోగ్య శాఖ అధికారుల సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

## రాష్ట్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ర్యాంకింగ్ లో జిల్లాకు రెండో స్థానం

**పెన్ పవర్ కడప జిల్లా, మార్చి 5 :** గ్రామ,పట్టణ స్థాయిలో వైద్యారోగ్య శాఖలో వైద్యాధికారులు,అనుబంధ శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ.. ప్రజలకు సంతృప్త స్థాయిలో ఆరోగ్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సూచించారు.

బుధవారం కలెక్టరేట్లోని పి.జి.ఆర్.ఎస్ హాలులో... ఆరోగ్యశ్రీ, అనుబంధ ఆస్పత్రులు ,పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల వైద్యులతో ఆరోగ్య సూచికలు, వైద్య శాఖ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి వైద్యాధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని.. వైద్యులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా అనారోగ్య సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉంటూ ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు.మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వ్యాధులు విజృంభించకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలనిదీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రైమరీ హెల్త్ సెంటర్ లలో ప్రస్తుత స్టేటస్ ఓపి,ఐపి, డెలివరీలు, ఇమ్యూనైజేషన్ వంటి రోజువారి డేటాను నమోదు చేయాలన్నారు. ప్రతి ఒక్క పీ.హెచ్.సి సెంటర్లోని వైద్యాధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేయాలన్నారు. పీ.హెచ్.సి పరిధిలో ప్రతి ఒక్కరికి ఆరోగ్య సేవలు అందించేలా పనిచేయాలన్నారు. వైద్యాధికారులు క్రమం తప్పకుండా ప్రతిరోజు విదులకు హాజరవుతూ.. క్రింది స్థాయి సిబ్బందిని కూడా సకాలంలో విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రైమరీ హెల్త్ సెంటర్లు,అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ఉత్తమమైన మౌలిక వసతుల సదుపాయాలు ఉన్నాయని ప్రతి ఒక్కరూ నిబద్ధతతో తమ కర్తవ్యాన్ని నిర్వహించాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందే వైద్య సేవలు, వైద్యాధికారుల పనితీరు, ఆరోగ్య కేంద్రాల్లో ఓపి ల నమోదు సంఖ్యను పెంచేలా చూడాలన్నారు. ప్రణాళికా ప్రకారం సుఖ ప్రసవాలు ఇమ్యునైజేషన్ వ్యాక్సినేషన్ ప్రక్రియ చేపట్టడం, మాతృ, శిశు మరణాల సంఖ్యను తగ్గించడం, 104 వాహనాల షెడ్యూలు, తల్లీ బిడ్డ ఎక్స్ ప్రెస్ సేవలు,తదితర ఆరోగ్య సేవలపై వైద్యాధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఒపి, ఐపి,ల్యాబ్ టెస్టు, డెలివరీ వంటి ఆరోగ్య సేవలలో %వా% గ్రేడ్ సాధించి.. రాష్ట్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ర్యాంకింగ్ లో జిల్లా రెండో స్థానంలో నిలిచిందని




తెలిపారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పర్ఫామెన్స్ ఇండికేటర్స్ లో మంచి ప్రతిభ చూపిన వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ అభినందించారు.

అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని వైద్యాధికారులు మూడు నెలల ప్లాన్ అఫ్ యాక్షన్ పైన పి పి టి ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అందించే హెల్త్ ప్రోగ్రామ్స్ ప్రత్యేక దృష్టి సారించి వెనుకబడిన పారామీటర్స్ లను మెరుగుపరుచుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూచించారు

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.నాగరాజు, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ బాలంజనేయులు,డీసీహెచ్ఎస్ ఇన్చార్జి కరిముల్ల , కడప డిప్యూటీ డిఎంహెచ్ఓ ఉమా మహేశ్వర రావు,బద్వేల్ డిప్యూటీ డిఎంహెచ్ఓ మల్లేష్,పులివెందుల డిప్యూటీ ఖాజా మొయినుద్దీన్,జమ్మలమడుగు డిప్యూటీ డిఎంహెచ్ఓ శివ ప్రసాద్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్స్, పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల వైద్యులు,తదితరులు పాల్గొన్నారు.

## నందీశ్వర ఆటో స్టాండ్ ప్రారంభించిన రెండవ పట్టణ సిఐ వెంకటేశ్వర్లు.





**శ్రీ కాళహస్తి - పెన్ పవర్, మార్చి 05.** శ్రీకాళహస్తి పట్టణంలోని రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నటువంటి నంది సర్కిల్లో నందీశ్వర ఆటో స్టాండ్ ను ప్రారంభించిన రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవే పడిన తర్వాత టౌన్ లో కి యాత్రికులు రావాలంటే కష్టంగా ఉండడంవల్ల ఈ ఆటో స్టాండ్ ప్రారంభించడం సంతోషించదగ్గ విషయం అన్నారు ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను పాటించే విధంగా దేవస్థానానికి వచ్చేటటువంటి యాత్రికులకు అనుకూలమైనటువంటి చార్జీలను తీసుకోవాలన్నారు డ్రైవింగ్ లైసెన్సులు ప్రతి ఒక్క డ్రైవర్ కి ఉండాలనీ సూచించారు.

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమనేదని ఏర్పాటు చేయాలని, సబ్సిడీలలో బ్యాంకు రుణాలు ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శివ సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, పట్టణ కార్యదర్శి రోడ్డ గోపి, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు వైయస్ మనీ, మురళి వీది విక్రయదారుల జిల్లా అధ్యక్షుడు జనార్ధన్, లాజర్ భాష, నందీశ్వర ఆటో యూనియన్ నాయకులు పాండు, గణేష్ మనోహర్, పుట్టయ్య, చిరు, జ్ఞానయ్య, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### సత్య కుమార్ యాదవ్ వైద్య ఆరోగ్య మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ ఆధ్వర్యంలో బీజేపీలోకి చేరికలు





**పెన్ పవర్ సత్య సాయి జిల్లా ధర్మవరం రూరల్ మార్చి 05:-** ధర్మవరంలోని పోతులనాగేపల్లికి చెందిన బీసీ నాయకుడు, ప్రముఖ సంఘసేవకుడు తలారి లక్ష్మీనారాయణ, తన అనుచరులతో కలిసి బుధవారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్చార్జ్ హరీశ్ బాబు కండువా కప్పి, తలారి లక్ష్మీనారాయణను మరియు వారి అనుచర వర్గాన్ని పార్టీలోకి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో హరీశ్ బాబు మాట్లాడుతూ, "ప్రధాని నరేంద్ర మోదీ యొక్క ఆశయాలు, ఆయన దృష్టి మరియు మంత్రి సత్య కుమార్ యాదవ్ గారు పట్టణంలో చేస్తున్న అభివృద్ధి చర్యలను చూసి లక్ష్మీనారాయణ గారు వారి అనుచర వర్గంతో బీజేపీలో చేరారు. ఆయన మరింత అభివృద్ధి పనులకు తన ప్రియమైన గ్రామం పోతులనాగేపల్లిలో మార్పు తీసుకురావాలని ఉద్దేశించారని" అన్నారు. అనంతరం తలారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, "భవిష్యత్తులో మరింత అభివృద్ధి, మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి బలమైన నాయకత్వంలో ధర్మవరం అభివృద్ధి చెందుతుంది కావున బీజేపీలో చేరడం నాకు సంతోషంగా ఉంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జింక చంద్రశేఖర, రూరల్ అధ్యక్షులు గొట్లూరు చంద్ర, బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, అంగజాల రాజు, శ్యామ్ రావు, కృష్ణాపురం జమీర్, సాకే ఓబులేష్, కంచపు నారప్ప, డి . చెర్లోపల్లి నారాయణస్వామి, బిజెపి మహిళా నాయకురాలు కంచం లీలావతి, బిజెపి మహిళా కార్యకర్తలు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ విభాగము: "ఉమ్మడి జిల్లాల పోలీస్ అధికారులతో ముందస్తు జాతీయ లోక్ అదాలత్ మీటింగ్:"





**కడప పెన్ పవర్ మార్చ్ 5.** 5-3-2025 వ తేదిన గౌరవ శ్రీమతి జి.శ్రీదేవి, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారి సూచనల మేరకు, గౌరవ శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-మరియు-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారు న్యాయ సేవా సదన్ కడప నందు ఉమ్మడి జిల్లా పోలీస్ అధికారులతో ముందస్తు జాతీయ లోక్ అదాలత్ మీటింగ్ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 08-03-2025 వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేవిధంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట అడిషనల్ ఎస్పీ మనోజ్ రామ్నాథ్ హెగ్డే, కడప అడిషనల్ ఎస్.పి ప్రకాష్ బాబు, ప్రొద్దుటూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి భావన, కడప సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వెంకటేశ్వర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు మరియు సబ్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## ఉద్యానవన శాఖలో ఉత్పత్తిదారుల సంఘాలకు మౌలిక సదుపాయాలు మరియు మార్కెటింగ్ అనుసంధానాలు.







**కడప పెన్ పవర్ మార్చ్ 5.** ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు మౌలిక సదుపాయాలు మరియు మార్కెటింగ్ అనుసంధానాల గురించి అవగాహన సదస్సు '%శీ%' బ్లాక్ ఆఫీసు ప్రక్కన %యిఖ ఎవవ్అఅస్త్ర ఫ్ఘుశ్రీశ్రీ% నందు ఏర్పాటు చేయడం జరిగింది.

ఉద్యాన శాఖ అధికారి (సాంకేతిక) జ్యోతిర్మయి నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎస్.ఎస్.వి. సుభాషిని, జిల్లా ఉద్యాన శాఖ అధికారి అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ ఏ నాగేశ్వరావు గారు, లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీ .జి. జనార్ధన గారు, నాబార్డ్ డీడీఎం. శ్రీ. విజయ విహారి గారు, అన్నమయ్య జిల్లా పీలేరు నుండి ఎఫ్ బి ఓ ని విజయవంతంగా నిర్వహించి అవార్డు గ్రహించిన శ్రీ జయబ్బనాయుడు గారు మరియు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, రైతులు పాల్గొనడం జరిగింది.

జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు గ్రూపులుగా ఏర్పడి, ఐక్యమత్యంగా ఉండి ఆర్థిక అభివృద్ధి చెందవచ్చు అని మరియు వ్యవసాయ రంగంలో కీలక పాత్రను పోషించాలనీ వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా వారిని మరింత శక్తివంతం చేయవచ్చని తెలియజేశారు.

లీడ్ బ్యాంక్ మేనేజర్ గారు రైతుల ఉత్పత్తిదారుల సంఘాలు ఎదుర్కొంటున్నటువంటి బ్యాంకు రుణాల సమస్యల గురించి చర్చించడం జరిగింది.

జిల్లా ఉద్యాన అధికారి సుభాషిని గారు రైతులు సంఘాలుగా ఏర్పడితే ప్రభుత్వం నుండి వచ్చే పథకాలు 75% రుణాలతో రాయితీ పొందవచ్చని తెలియజేయడం జరిగింది.

నాబార్డు డిడియం గారు మాట్లాడుతూ రైతులు ఉత్పత్తి దారుల సంఘాల అభివృద్ధికి నాబార్డు ద్వారా అన్ని విధాలుగా సహాయపడుతుందని తెలియజేశారు.

విజయవంతంగా నిర్వహిస్తున్నటువంటి రైతు ఉత్పత్తిదారుల సంఘము అన్నమయ్య జిల్లా పీలేరు నుండి వచ్చినటువంటి జయబ్బనాయుడు గారు ఆయన యొక్క అనుభవాలను రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో పంచుకోవడం జరిగింది..

## బాలల సంరక్షణ కేంద్రాలు రిజిస్ట్రేషన్ తప్పనిసరి. జువెనైల్ జస్టిస్ డిపార్ట్మెంట్.

**పెన్ పవర్ కడప మార్చ్ 5.** బాలల సంరక్షణ కేంద్రాలు నడుపుతున్న సంస్థలు మరియు వ్యక్తులకు తెలియజేయడమేమనగా జువేనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ మరియు రక్షణ చట్టం) 2015 మరియు సవరించబడిన చట్టం 2021 లోని సెక్షన్ 41 ప్రకారం మరియు జువేనైల్ జస్టిస్ ( పిల్లల సంరక్షణ మరియు రక్షణ చట్టం ) 2021 లోని సెక్షన్ 41 ప్రకారం మరియు జువేనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ మరియు రక్షణ ) నిబంధనలు 2016 మరియు సవరించబడిన నిబంధనలు 2022 లోని నిబంధన నిబంధన 21 ప్రకారం "రక్షణ మరియు అవసరమైన పిల్లలు" కొరకు మరియు "చట్టంతో విభేదించబడిన పిల్లలు "కొరకు పూర్తిగా కానీ పాక్షికంగా గాని ప్రభుత్వం చేతగాని ప్రభుత్వేతర సంస్థల చేతన గాని ప్రభుత్వం నుండి లేదా రాష్ట్ర ప్రభుత్వం నుండి నిధులు పొందడం ద్వారా ప్రభుత్వం నిధులు లేకుండా కానీ నడపబడుతున్న బాలల సంరక్షణ కేంద్రాలన్నీ ఇతర ఏదైనా చట్టం క్రింద లైసెన్స్ తీసుకున్నప్పటికీ జువేనైల్ జస్టిస్ ( పిల్లల సంరక్షణ మరియు రక్షణ చట్టం ) 2015 లోని సెక్షన్ 41 క్రింద తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవలసి ఉంటుంది. దీని ప్రకారం శ్రీయుత సంచాలకులు బాలల సంక్షేమ సంస్కరణలు సేవలు మరియు వీధి బాలల సంక్షేమ శాఖ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారు సదరు బాలుల సంరక్షణ కేంద్రాలను జువేనైల్ జస్టిస్ ( పిల్లల సంరక్షణ మరియు రక్షణ చట్టం) 2015 లోని సెక్షన్ 41 క్రింద రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు దీనికి సంబంధించిన నోటిఫికేషన్ చిరునామా అర్హత జతపరచిన డాక్యుమెంట్స్ చెక్లిస్ట్ మొదలైన వాటికి %ఫ్రీజా://షఎఎ.ఖజూ.ప్రశీజ.అఅ% అనే వెబ్సైట్ అనే వెబ్సైట్ నుండి పొందవచ్చును .

జువేనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ మరియు రక్షణ చట్టం )2015 లోని సెక్షన్ 42 ప్రకారం ఏదైనా సంస్థ లేదా వ్యక్తి ఈ చట్టం లో సెక్షన్ 41 లోని నిబంధనలు పాటించటంలో విఫలమైతే ఒక సంవత్సరం వరకు జైలు శిక్ష లేదా లక్ష రూపాయలు తగ్గకుండా జరిమానా విధించబడుతుంది కనుక కనుక బాలల సంరక్షణ కేంద్రాలను ఎవరైతే నడుపుతున్నారో వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవలసినదిగా కోరడమైనది. రిజిస్ట్రేషన్ దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది :10.03.2025.

## న్యాయ విభాగము: "పులివెందుల సబ్ జైలు విజిట్:"





**కడప పెన్ పవర్ మార్చి 5 .** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ శ్రీమతి జి. శ్రీదేవి, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు పులివెందుల సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ ను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్ లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే పులివెందుల మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమములో పులివెందుల సబ్ జైలు సూపరింటెంట్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా భద్రతా వారోత్సవాలు







### హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ ఆధ్వర్యంలో.. కడప బాకరాపేట ప్లాంట్ కార్యాలయంలో....

**పెన్ పవర్ కడపమార్చి 5.** హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆఫ్ సైట్ అత్యవసర కెమికల్ మాక్ డ్రిల్.

ఐఓసీ అధికారులు భాకరాపేట ప్లాంట్ కార్యాలయంలో ఈ సమావేశం జరిగినది.

## అసెంబ్లీ అంచనాల కమిటీ సభ్యునిగా ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్





**టౌన్ రిపోర్టర్ గూడూరు పెన్ పవర్ మార్చి 05.** అసెంబ్లీ సమావేశాలలో భాగంగా శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన శాసన సభా భవనంలో శాసనసభ ప్రజాపద్దుల కమిటీ (పబ్లిక్ అకౌంట్స్ కమిటీ), శాసనసభ అంచనాల కమిటీ (ఎస్టిమేట్స్ కమిటీ), ప్రభుత్వ సంస్థల కమిటీ (పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ) ల ప్రాథమిక సమావేశంకు గూడూరు ఎమ్మెల్యే డాక్టర్.పాశిం సునీల్ కుమార్ హాజరైయ్యారు. ఆయన మాట్లాడుతూ

అంచనాల కమిటీ లో సభ్యులుగా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు.నెలలో కనీసం రెండు సార్లు ఆర్థిక కమిటీలు సమావేశం కావాలని స్పీకర్ తెలిపారు.

# ప్రభుత్వం మారినా ఆగని వైసిపి నాయకుల ఆక్రమణలు.





- నకిలీ ఎల్పీసీలతో 4 ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసిన మహిళా వార్డు మెంబర్.
- ఇప్పటికే ఆక్రమించిన స్థలంలో రెండు ఇల్లులు నిర్మాణాలు.
- మూడో ఇంటిని అప్పట్లో అడ్డుకున్న రెవెన్యూ అధికారులు.
- ఇప్పుడు తిరిగి అక్రమ నిర్మాణాన్ని కడుతున్న వైనం.
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు.

**పరవాడ(పెన్ పవర్):మార్చ్ 5:** మేజర్ పంచాయతీ పరవాడ గ్రామ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 11 లో వైసిపి మహిళ వార్డు మెంబర్ బినామీ పేర్లతో 5 ప్రభుత్వ స్థలాలను ఆక్రమించింది. ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వైసీపీ నాయకుల ప్రభుత్వ భూముల ఆక్రమణలు ఆగలేదు. సరి కదా మరింత విజృంభిచాయి.ప్రభుత్వం అప్పట్లో మంజూరు చేసిన ఒక పట్టా ఆధారంగా మరో నాలుగు ఇళ్ల స్థలాలను సదరు వైసీపీ వార్డు మెంబర్ ఆక్రమించింది. వాటికి ఎల్పీసీలు సృష్టించింది. ఆక్రమించిన ఇళ్ల స్థలాల్లో వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రెండు ఇండ్లను నిర్మించింది. నాలుగు నెలల క్రితం ఫేక్ ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ సృష్టించి ఆక్రమించిన మరో ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టింది. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు విచారణ జరిపి అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్నారే గాని పూర్తిస్థాయిలో తొలగించలేదు. ఇంతలో వీఆర్వో వేరే పంచాయతికి బదిలీ కావడంతో కొత్తగా వచ్చిన వీఆర్వో, రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ స్థాయిలో విధులు నిర్వహిస్తున్న అధికారి, పరవాడ బీసీ కాలనీకి చెందిన ఔట్సోర్సింగ్ లో విధులు నిర్వహిస్తున్న మరో రెవెన్యూ ఉద్యోగి మధ్యమార్గంగా సదరు వైసిపి వార్డు మెంబర్ డీల్ కుదుర్చుకుంది. దీంతో గ్రౌండ్ లెవెల్ లో ఉన్న అక్రమ నిర్మాణం స్లాబ్ స్థాయికి వచ్చింది. విషయం బయటకు పొక్కడంతో స్థానికులు నెలరోజుల క్రితం రెవెన్యూ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేయడంతో తిరిగి ఆ అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్నారు. ఇదంతా బాగానే ఉన్నా ఇప్పుదున్న విఆర్ఓ సహకారంతో తిరిగి అక్రమ నిర్మాణం చేపట్టడానికి సదరు వైసిపి వార్డు మెంబర్ రంగ సిద్ధం చేసింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మహిళా వైసిపి వార్డు మెంబర్ నిర్మిస్తున్న అనాధకర నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో తొలగించాలని,సదరు వైసిపి వార్డు మెంబర్ బినామీ పేర్లతో నకిలీ ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లతో ఆక్రమించిన ఇళ్ల స్థలాల పై విచారం జరిపి వాటిని స్వాధీనం చేసుకొని అర్హులైన వారికి ఇవ్వాలని కాలనీవాసులు కోరుతున్నారు.





# శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో ఏఆర్ అండ్ వీఆర్ ల్యాబ్



**టౌన్ రిపోర్టర్ గూడూరు పెన్ పవర్ మార్చి 05**

గూడూరు పట్టణంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్ ) అండ్ వర్చువల్ రియాలిటీ (వీఆర్) ల్యాబ్ ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డెల్టా జనరల్ మేనేజర్ ఇంద్రాణి, మేనేజింగ్ డైరెక్టర్ రాజు, కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, అకడమిక్ డీన్ శ్రీహరి పాల్గొని ల్యాబ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికత విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయుక్తమని, ఇలాంటి ల్యాబ్ ద్వారా విద్యార్థులు ప్రాక్టికల్ నాలెడ్జ్ పొందేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. స్కూల్ యాజమాన్యం ఈ కొత్త సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని వారు ప్రశంసించారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ శివ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఏఆర్ ల్యాబ్ లో విద్యార్థులకి గణితం సైన్స్ లకు హోలో క్యూబ్స్ ద్వారా కష్టమైన అంశాలు ఆసక్తికరంగా సులభంగా నేర్చుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డెల్టా ప్రతినిధులు ఆంజనేయులు, ఇమ్రాన్, అకడమిక్ డీన్ శ్రీహరి,ఉపాధ్యలు రఫీ,మస్తాన్ బి,సుప్రజ,హరిత,శిరీష,నసీర,విద్యార్థులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా కౌమార బాలికలకు వృత్తి శిక్షణా కార్యక్రమం.







**నర్సింగ్ కాలేజీ ,రిమ్స్ , కడప.కడప పెన్ పవర్ మార్చ్ 5.**

ఈ కార్యక్రమంలో విశిష్ట అధితిగా శ్రీమతి శ్రీ లక్ష్మి, జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ మరియు మహిళా సాధికారిత అధికారి గారు మాట్లాడుతూ సమాజంలో ప్రతి మహిళ తమ జీవితంలో తప్పకుండా స్కిల్స్ మెరుగుపరుచుకోవాలని , నర్సింగ్ వృత్తి చాలా ప్రాముఖ్యమైనది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ హిమ గిరి కుమారి గారు మాట్లాడుతూ నర్సింగ్ వృత్తి ని ఎంచుకోవడం ఎంతో విశిష్టమైనది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, %ఐనఙఔ% సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మండల టిడిపి సీనియర్ నేతలకు "ఆదరణ" లేదని "ఆవేదన "...!



**కొయ్యూరు,పెన్ పవర్ మార్చి5:**వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో వేధింపులకు గురై, తట్టుకొని నిలబడి, టిడిపి బలోపేతానికి కృషి చేసిన తమకు టిడిపి అధికారంలోకి వచ్చినా అధికారుల ఆదరణ లేదని, అలాగని సొంతపార్టీ నియోజకవర్గ నేతల్లో గుర్తింపు లేదని మండల టిడిపి సీనియర్ నేతలంతా నిట్టూర్పు, నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీ గెస్ట్ హౌస్ లో సమావేశమైన నేతలంతా ఇలా విచారం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వ హయాంలో టిడిపి బలోపేతానికి కృషి చేసిన తమకు, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా, అధికారుల్లో ఎటువంటి గుర్తింపు లేదన్నారు. రాష్ట్రమంతా కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ, మండలంలో ఇంకా వైసీపీ అధికారంలో ఉన్నట్టే అధికారులు ప్రవర్తిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. మండలంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు తమకు కనీస సమాచారం లేదన్నారు. అధికారుల తీరుపై మండలంలోని 33 పంచాయతీలలో ఉన్న కూటమి నాయకులంతా సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు ఫిర్యాదు చేస్తామన్నారు. అలాగే పార్టీ నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకులు కూడా కార్యకర్తలను, నాయకులను గాలికి వదిలేసి వైసిపి నాయకులతో కుమ్మక్కై అభివృద్ధి సంక్షేమ పథకాలు వైసీపీ నాయకులతో కలిసి నడిపిస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తల బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు మండల పార్టీ అధ్యక్షులు గొలిసింగి సత్యనారాయణ, మాజీ మార్కెట్ చైర్మన్ దుచ్చరి చిట్టిబాబు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి కొర్రు రామమూర్తి, అనిశెట్టి చిరంజీవి, రొంగల గోవిందు, యలమంచిలి వరహాలబాబు, మాజీ మండల ప్రధాన కార్యదర్శి ఎక్స్ ఎంపిటిసి బి.శివరామరాజు, మండల ఉపాధ్యక్షులు ఉల్లి వెంకటేశ్వర్లు, కురుజు శ్రీను, కులిసెట్టి జోగారావు, బేతాళ అప్పన్న,పల్లాల అబ్బాయిరెడ్డి సర్పంచ్ పీటా సింహాచలం, ఖాన్, టిఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షులు పొటుకూరి సన్యాసిరావు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రాంతీయ ఆసుపత్రి లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించండి.





**అల్లూరి జిల్లా ప్రాంతీయ ఆసుపత్రుల సమన్వయ అధికారిణి కె లక్ష్మి.**

**చింతపల్లి పెన్ పవర్ మార్చి 06:** చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించిన అల్లూరి జిల్లా ప్రాంతీయ ఆసుపత్రుల సమన్వయ అధికారిణి కె లక్ష్మి.

బుధవారం ఆమె స్థానిక సూపరిండెంట్ ఇంద్ర ప్రియాంకతో కలిసి వార్డులలో అనేక రకాల వ్యాధులతో బాధపడుతున్న రోగుల వద్దకు వెళ్లి రోగులకు అందుతున్న వైద్య సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. వేసవికాలం ప్రారంభం నేపథ్యంలో వడదెబ్బలు, వివిధ రుగ్మతల వ్యాధుల బారిన పడిన రోగులు ఆసుపత్రికి తరలివస్తే రోగులకు అందుబాటులో ఉండాలని మెరుగైన వైద్య సేవలు ఆదేశించారు అదేవిధంగా ల్యాబ్ టెక్నీషియన్ గదిని సందర్శించి రోజుకు ఎంత మందికి రక్త పరీక్షలు చేస్తున్నారని, ఎంతమందిలో ఏ వ్యాధులు ప్రబలుతున్నాయో, వ్యాధిగ్రస్తులకు ల్యాబ్ టెక్నీషియన్ సిబ్బంది సేవలు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయని ఆమె అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాంతీయ ఆసుపత్రి సిబ్బంది రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యక్తిగత సమస్యలు ఒక్కొక్కరిని సమావేశం ఏర్పాటు చేసుకొని వివరాలు అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి ప్రాంతాన్ని సందర్శించి వంద పడకల ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్న గుత్తేదారులతో చర్చించి, వీలైనంత త్వరగా నిర్మాణం చేపట్టి వంద పడకల ఆసుపత్రిని తమకు అప్పగించాలన్నారు. ప్రాంతీయ ఆసుపత్రిలో స్పెషలిస్ట్ వైద్యాధికారుల నియామకానికి వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే స్పెషలిస్ట్ వైద్యాధికారులు నియామకానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రాంతీయ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు, మౌలిక వసతలు కల్పనకు ప్రత్యేక దృష్టి సారించామని ఆమె అన్నారు. త్వరలోనే సమస్యలు పరిష్కరించడంతోపాటు రోగులకు నిరంతర వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్యశాఖ సిబ్బంది సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి సూపరిండెంట్ చంద్రశేఖర్, ప్రాంతీయ ఆసుపత్రి వైద్యాధికారులు రుక్మిణి, భారతి, లావణ్య, సాయి కృష్ణ, ప్రభావతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రిబుల్ ఐటీ లో లైంగిక వేధింపు లు









**కడప పెన్ పవర్ మార్చ్ 5.** ఇడుపులపాయ ట్రిబుల్ ఐటీ లో విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ...

ఒంగోలు ట్రిబుల్ ఐటీ ఫిజిక్స్ ఒప్పంద అధ్యాపకుడు తిరుపతిరావు...

విద్యార్థిని ఫిర్యాదు మేరకు ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు...

ఇడుపులపాయ ట్రిబుల్ ఐటీ లో ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న విద్యార్థిని..

ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోయిన ఫిజిక్స్ లెక్చరర్ తిరుపతిరావు..

వివరాలను వెల్లడించిన ఎస్సై తిరుపాల్ నాయక్.

# డ్రంకన్ డ్రైవ్ 18 కేసుల్లో రూ. 1.80 లక్షల జరిమానా

**మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదా రులపై విస్తృతమవుతున్న పోలీసు తనిఖీలు**

**విజయనగరం క్రైమ్ బ్యూరో ,పెన్ పవర్, మార్చి 5. :**

మద్యం సేవించి పట్టుబడితే రూ.10 వేలు జరిమానా లేదా జైలుశిక్ష విధిస్తున్న న్యాయ స్థానాలు ఒక్క రోజునే 18మందిపై నమోదైన డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో రూ.1.80లక్షలు జరిమా నాగా చెల్లించిన 18మంది వాహనదారులు, మద్యం సేవించి వాహనాలు నడిపి, పట్టుబ డితే.. నేరా న్ని న్యాయ స్థానాలు తీవ్రమైన పరిగణించి, ఇటీవల కాలంలో వాహనదారులు ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధిస్తున్నా రని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మార్చి 5న తెలి పారు.జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో విజయనగరం ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, మద్యం సేవించి, వాహనాలు నడిపిన వారిపై 18కేసులు నమోదు చేసి, విజయనగరం అడిషనల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి వద్ద హాజరుపర్చగా, ఎ.జె.ఎఫ్.సి.ఎం. మెజిస్ట్రేట్ శ్రీమతి బి.రమ్య గారు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం రూ.1.80లక్షలను జరిమానగా విధించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపా రు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలకు గురవ్వడం లేదా ఇతర వాహనాల ను ఢీ కొట్టి ప్రమాదాలకు కారకులవుతున్నార న్నారు. ఈ తరహా వాహనదారులను కట్టడి చేసేందుకు, ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రతీ రోజూ నిర్వహిస్తున్న విజిబుల్ పోలీసింగు లో భాగంగా ప్రత్యేకంగా డ్రంకన్ డ్రైవ్ చేపట్టి, డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతూ, మద్యం సేవించి, వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

# ప్రైవేట్ పనుల్లో బెజవాడ పోలీసులు




**విజయవాడ, మార్చి 5, పెన్ పవర్:** సోషల్ మీడియా, యూ ట్యూబర్లతో దోస్తీ చేస్తున్న బెజవాడ పోలీసులు ప్రజల వ్యక్తిగత గోప్యతతో చెలగాటాలు ఆడుతున్నారు. గత కొన్ని నెలలుగా సాగుతున్న ఈ వ్యవహారంలో కొందరు పోలీసులే వీడియోలు రికార్డు చేసి ప్రైవేట్ వ్యక్తులకు షేర్ చేయడం చర్చనీయాంశంగా మారింది. విజయవాడలో ట్రాఫిక్ చలాన్లు, నిబంధనల ఉల్లంఘన, హెల్మెట్ లేకుండా వాహనాలను నడిపే వారిని పోలీసులు ప్రశ్నించే వీడియోలు ఇటీవల కాలంలో వైరల్ అవుతున్నాయి. మహిళలు, వృద్ధులు, ఉద్యోగుల వాహనాలను తనిఖీ చేసే సమయంలో నిబంధనల్ని ఉల్లంఘిస్తే వారికి జరిమానా విధిస్తున్నారు. జరిమానాలతో పాటు ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారి వీడియోలను పోలీసులే సోషల్ మీడియాలో షేర్ చేయిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనల్ని కఠినంగా అమలు చేసే విషయంలో ఎవరికి అభ్యంతరం లేకున్నా, చలానాలను విధించే సమయంలో పోలీసులు బాడీ కెమెరాలతో రికార్డు చేస్తున్న వీడియోలు, మొబైల్ ఫోన్లలో రికార్డు చేసే వీడియోలను యూ ట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్ ఫ్లూయెన్సర్లతో షేర్ చేస్తున్నారు. ఈ తరహా వీడియోలు వైరల్ అవుతున్నాయి. తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిని సైతం మీడియా ముందు ప్రవేశ పెట్టే సమయంలో ముసుగులు వేసి చూపించే పోలీసులు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడే వారి విషయంలో వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాపిక్ కూడళ్ల వద్ద సాధారణంగా విఐపి మూమెంట్ ఉంటే తప్ప పోలీసులు కనిపించరు. రద్దీ సమయాల్లో జనం ఎవరి బాధలు వారు పడాల్సిందే. ట్రాఫిక్ నియంత్రణ సంగతి ఎలా ఉన్నా నిత్యం ఉదయం, సాయంత్రం చలాన్లు రాయడం మాత్రం విధిగా చేపడుతున్నారు. ట్రాఫిక్ జరిమానాలు మార్చి 1 నుంచి గణనీయంగా పెరిగాయి. ఈ క్రమంలో ప్రతి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో పోటాపోటీగా చలాన్లు విధిస్తున్నారు. మద్యం సేవించి పట్టుబడే వారిని న్యాయస్థానంలో హాజరు పరిస్తే రూ.10వేల జరిమానాతో పాటు జైలు శిక్షలు కూడా విధిస్తున్నారు. ట్రాఫిక్ చలాన్లు వసూలు చేసే క్రమంలో పోలీస్ అధికారులు ఉద్దేశ పూర్వకంగా వాటిని సొంత పబ్లిసిటీ కోసం వాడుకుంటున్నారు. కానిస్టేబుళ్లతో వీడియోలు తీయించుకుని సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లకు షేర్ చేస్తున్నారు. ఆ వీడియోల్లో హెల్మెట్ పెట్టుకోని యువతీ యువకుల్ని పోలీసులు మందలించడం, హెచ్చరించడం వంటివి కూడా ఉంటున్నాయి. జరిమానాలు చెల్లించక పోతే వాహనాలను సీజ్ చేస్తున్నారు. పోలీసులు రికార్డు చేసే వీడియోలను న్యాయస్థానాల్లో సాక్ష్యాలుగా మాత్రమే పరిగణించాల్సి ఉండగా పబ్లిసిటీ కోసం సోషల్ మీడియా వేదికలపై షేర్ చేయడం, వారి ముఖాలను అందరూ గుర్తించేలా షేర్ చేస్తున్నారు. పోలీసుల అధికారిక హ్యాండిల్స్‌లో కూడా మహిళలు, మైనర్ల ఫోటోలను ముఖాలను గుర్తించేలా షేర్ చేస్తున్నారు. పోలీసుల తనిఖీల సందర్భంగా యువతులు, విద్యార్థినులు, మహిళల్ని ప్రశ్నిస్తున్న ఫోటోలను బహిరంగ వేదికలపై షేర్ చేస్తున్నారు. విజయవాడ సీపీగా కాంతి రాణా తాతా, డీసీపీ విశాల్ గున్నీలు ఉన్న సమయంలో సొంత పబ్లిసిటీ కోసం కొన్ని యూ ట్యూబ్ ఛానళ్లను ప్రోత్సహించారు. పర్సనల్ వీడియోలతో పబ్లిసిటీ చేయించడం, యువతలో గుర్తింపు తెచ్చుకోవడం కోసం వీటిని కొందరు అధికారులు ఉపయోగించే వారు. ఈ తరహా వీడియోలకు మిలియన్లలో వ్యూలు, వేలల్లో లైక్‌లు వస్తున్నాయి తద్వారా అయా ఛానళ్లకు భారీగా ఆదాయం కూడా లభిస్తోంది. ఏపీ పోలీస్ శాఖ వీడియోలను బయటి వారికి షేర్ చేయడం వాటితో ప్రైవేట్ వ్యక్తులకు ఆదాయం పొందడంపై అధికారులు కిమ్మనడం లేదు. పోలీస్ అధికారులు విధుల్లో ఉన్న సమయాల్లో క్లోజప్ షాట్స్, డ్రోన్ షాట్స్ తో సినిమాటిక్ ఎఫెక్ట్‌లతో పబ్లిసిటీ చేయించుకునే వారు. ఆ తర్వాత అధికారులు మారినా మిగిలిన వారు కూడా వాటిని అనుసరించడం మొదలు పెట్టారు. సీఐ స్థాయి అధికారుల నుంచి డీసీపీల వరకు ఇదే బాట పట్టారు. ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగమని తెలిసినా తీవ్ర నేరాలకు పాల్పడినట్టు సోషల్ మీడియాలో దోషులుగా చిత్రీకరిస్తున్నారు. ట్రాఫిక్ చలాన్ల విధించే సమయంలో రికార్డు చేస్తున్న వీడియోలను సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలపై షేర్ చేయడంపై విజయవాడ ట్రాఫిక్ డీసీపీ వివరణ కోరినా స్పందించలేదు.

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు
7702262666

# 5 ఎమ్మెల్సీ ఎన్నికలకు భారీగా ఆశావహులు



**విజయవాడ, మార్చి 5, పెన్ పవర్:**
ఏపీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి మొదలైంది. గ్రాడ్యుయేట్లు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియడం, ఎమ్మెల్యేల కోటా భర్తీకి నోటిఫికేషన్ వెలువడటంతో అభ్యర్థుల ఎంపిక కసరత్తు మొదలైంది. జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని అంగీకారం కుదిరింది. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక నేపథ్యంలో సోమవారం అసెంబ్లీలోని సీఎం ఛాంబర్లో చంద్రబాబు, పవన్ కల్యాణ్ సోమవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో నాగబాబు అభ్యర్థిత్వం ఖరారైనట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు సహా పలు అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు, అభ్యర్థుల ఎంపికపై ఇద్దరూ కొద్ది సేపు చర్చించినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఎన్ని కలు జరగనున్న ఐదు స్థానాల్లో ఒక దానిని నాగబాబుకు ఇవ్వాలని నిర్ణయించారు. రాజ్యసభ ఎన్నికల సమయంలోనే నాగబాబు పేరు చర్చకు వచ్చింది. అంతకు ముందు టీటీడీ ఛైర్మన్ రేసులో కూడా వినిపించింది. రాజ్యసభ ఎన్నికల సమయంలో నాగబాబుకు మంత్రి పదవి ఇస్తామని ప్రకటించారు. సీఎం చంద్రబాబు అసెంబ్లీలో కూర్చుని ఉండగా.. పవన్ కల్యాణ్ ఆయన వద్దకు వెళ్లారు. అసెంబ్లీలో కొద్ది నిమిషాలు మాట్లాడుకున్న తర్వాత ఇద్దరూ కలిసి సీఎం ఛాంబర్‌కు వెళ్లారు. బడ్జెట్లో వివిధ శాఖలకు కేటాయింపుల పై పవన్ కల్యాణ్ తన అభిప్రాయాలు ముఖ్యమంత్రితో చెప్పినట్టు తెలుస్తోంది. మే నెల నుంచి ప్రారంభించే తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ పథకాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రహదా రుల పనులు చాలా వరకు చేశామని.. తాగునీటి సరఫరాపై ఎక్కువ దృష్టి పెట్టామని చంద్రబాబుకు పవన్ వివరించారు. ఉపాధి హామీ ద్వారా రాష్ట్రానికి ఎక్కువ నిధులు రాబట్టుకుని పెద్దఎత్తున పనులు చేయాల్సిన అవసరంపై చర్చించారు. రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రికి పవన్ కల్యాణ్ సూచించారు. ప్రస్తుతం మండలిలో జనసేన తరపున పిడుగు హరిప్రసాద్ ఎమ్మెల్సీగా ఉన్నారు. అదే సామాజిక వర్గానికి చెందిన నాగబాబును ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. మంత్రి వర్గంలో ప్రస్తుతం పవన్‌తో పాటు కందుల దుర్గేష్ ఉన్నారు. నాగబాబుకు మంత్రి పదవి ఇస్తామని ఇప్పటికే ప్రకటించడంతో మూడో మంత్రి పదవి కూడా జనసేనలో అదే సామాజిక వర్గానికి దక్కనుంది. టీడీపీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఆశిస్తున్న వారి జాబితా భారీగా ఉంది. ఎన్నికల పొత్తులో భాగంగా సీట్లు దక్కని వారంతా ఎమ్మెల్సీ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. వీరిలో మాజీ మంత్రులు కూడా ఉన్నారు. చంద్రబాబును, లోకేష్‌ను ప్రసన్నం చేసుకోడానికి ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమా, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, అశోక్ బాబు వంటి నేతలుఎమ్మెల్సీ స్థానం కోసం ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఆశిస్తున్న పలువురు నేతలు అసెంబ్లీలో చక్కర్లు కొడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను ప్రసన్నం చేసుకోవాలని తహతహలాడుతున్నారు. ఖాళీ అవుతున్న ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ సోమవారం మొదలైంది. యనమల రామకృష్ణుడు, బీటీ నాయుడు, ఆశోక్బాబు, దువ్వారపు రామారావు, జంగా కృష్ణమూర్తిల పదవీకాలం ఈ నెల 28తో ముగుస్తోంది. శాసనసభలో కూటమి పార్టీలకే అన్ని స్థానాలను దక్కించుకునే అవకాశం ఉంది. ఒక స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో మిగిలిన నాలుగు స్థానాలపై పోటీ తీవ్రంగా ఉంది. బీజేపీ కూడా ఒక స్థానాన్ని కోరే అవకాశం ఉంది. మాజీ మంత్రులు కేఎస్ జవహర్, పీతల సుజాత, కేఈ ప్రభాకర్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, విశాఖకు చెందిన మహ్మద్ నజీర్ అసెంబ్లీలో దర్శనం ఇచ్చారు. దువ్వారపు రామారావుకు మళ్లీ అవకాశం కల్పించాల్సిందిగా ముఖ్యమంత్రిని కోరాలని విశాఖ జిల్లాకు చెందిన ఎమ్మె ల్యేలు రాత్రి సమావేశమై నిర్ణయించారు. శాసనసభ ఎన్నికల్లో పొత్తులతో పోటీ చేసే అవకాశం కోల్పోయిన వారంతా ఎమ్మెల్సీ కోసం పోటీపడుతున్నారు.

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు
7702262666

# గందరగోళంగా మారిన టౌన్ ప్లానింగ్

**నెల్లూరు, మార్చి 5, పెన్ పవర్:** ఏపీ మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ చెప్పేది ఒకటి ఆ శాఖలో జరిగేది మరొకటి? ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్మాణ రంగానికి ఊతం ఇచ్చేలా పలు నిర్ణయాలను .నారాయణ ప్రకటించారు. వంద గజాల్లోపు ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మొదలుకుని అపార్ట్‌మెంట్ల నిర్మాణం వరకు భవన నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలకు చెక్ పెట్టేందుకు పలు నిర్ణయాలను ప్రకటించారు. అయితే మంత్రి నారాయణ చెప్పిన వాటిలో ఇప్పటి వరకు ఒక్క నిర్ణయం కూడా అమలు కాలేదు. తాజాగా గత వారం హైకోర్టు ఆదేశాలతో? పురపాలక శాఖ భవన నిర్మాణ నిబంధనలు మరింత కఠినతరం చేసింది. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విషయంలో ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనల్ని ఉల్లంఘిస్తే మరింత కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. మునిసిపల్ శాఖ మంత్రి నారాయణ చెప్పిన దానికి ఆ శాఖలో క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలకు పొంతన కుదరడం లేదు. దీనిపై భవన నిర్మాణ రంగంలో ఉన్న వారి నుంచి బహిరంగంగానే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తాజాగా భవన నిర్మాణదారుల కోసం అందుబాటులోకి వచ్చిన కొత్త సాఫ్ట్ వేర్ తీసుకొచ్చినట్టు మంత్రి నారాయణ ప్రకటించారు. 18 మీటర్ల ఎత్తు లోపు నిర్మించే భవనాలకు స్వీయ ధ్రువీకరణ పత్రం సరిపోతుందని టౌన్ ప్లానింగ్ అధికారులతో సంబంధం లేకుండా సరైన పత్రాలు సమర్పిస్తే ఆటోమెటిక్ గా అనుమతులు మంజూరవుతాయని ప్రకటించారు. ఈ విధానం 2019 నాటికి విజయవాడలో అమల్లో ఉంది. అయితే ఆటోమెటిక్ అనుమతుల జారీ విధానాన్ని పూణేకు సంబంధించిన కంపెనీకి అప్పట్లో అప్పగించారు. ప్రభుత్వం భవన నిర్మాణదారులకు ఎవరి జోక్యం లేకుండా ఈ అనుమతులు జారీ చేసే ఉద్దేశంతో సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెడితే అందులో కూడా టౌన్ ప్లానింగ్ వేలు పెట్టింది. కార్పొరేషన్ల పరిధిలో అధికారుల్ని ప్రసన్నం చేసుకుంటేనే ఆన్‌లైన్‌లో అనుమతి జారీ అయ్యేలా మార్పులు చేశారు. దీంతో గత ఐదేళ్లలో భవన నిర్మాణదారులు నరకం అనుభవించారు. అన్ని రకాల ఫీజులు చెల్లించినా కొర్రీలు వేసి ముప్ప తిప్పలు పెట్టేవారు. మునిసిపల్ కమిషనర్లను కూడా ఖాతరు చేయకుండా టౌన్ ప్లానింగ్ విభాగం వ్యవహరించేది.

సెల్ఫ్ సర్టిఫికేషన్ సరిపోతుందా??

భవన నిర్మాణాలకు అనుమతుల విషయంలో స్వీయ ధృవీకరణ సరిపోతుందని గత నెలలో జీవో జారీ చేశారు. ఆ తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విషయంలో మరికొన్ని నిబంధనలు విధించారు. తాజాగా రిజిస్టర్డ్ ఇంజినీర్లు,ఆర్కిటెక్ట్ లు యజమానుల సమక్షంలో ఆన్ లైన్ లో సెల్ఫ్ సర్టిఫికేషన్ ఇస్తే సరిపోతుందని ప్రకటించారు. భవన నిర్మాణ అనుమతులను త్వరితగతిన జారీ చేసేలా ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చిందని మంత్రి నారాయణ చెబుతున్నారు. ఓఖఆఖఓా పోర్టల్ లో సెల్ఫ్ సర్టిఫికేషన్ విధానం అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. అయితే భవన నిర్మాణాలను కొనసాగించడానికి కార్పొరేషన్ల పరిధిలో మార్టగేజ్ చేయాల్సి ఉంటుంది. నిబంధనలు ఉల్లంఘిస్తే తనఖా పెట్టిన భాగాలను జప్తు చేయడంతో పాటు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విడుదల కాదు. ఏపీలో 2019 నాటికి 250కు మించిన స్థలంలో 18మీటర్ల ఎత్తు వరకు భవనాలను నిర్మించుకనే వెసులుబాటు ఉంది. ఆ తర్వాత నిర్ణత బాండ్లను చెల్లించి ఆరో అంతస్తు నిర్మాణం చేపట్టేందుకు కూడా వైసీపీ ప్రభుత్వంలో అనుమతులిచ్చారు. దీంతో 250-30గజాల్లోపు స్థలాల్లో ఆరంతస్తుల వరకు నిర్మాణాలను చేపట్టే అవకాశం లభించింది. ఇకపై 18 మీటర్ల లోపు లేదా ఐదంతస్తుల లోపు భవనాల నిర్మాణాల అనుమతులకు స్వీయ ధృవీకరణ పత్రం ఇస్తే సరిపోతుందని ...టౌన్ ప్లానింగ్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి అవసరం లేకుండానే భవన నిర్మాణాలకు పర్మిషన్ వచ్చేస్తుందని ప్రభుత్వం చెబుతోంది. భవన యజమానులు రిజిస్టర్డ్ ఎల్ టీపీలు,ఇంజినీర్లు లేదా ఆర్కిటెక్ట్ ల సమక్షంలో సరైన పత్రాలు సమర్పించి స్వీయ ధృవీకరణ(అఫిడవిట్)ఇవ్వాల్సి ఉంటుందని మెలిక పెట్టారు. గత నెలలోనే భవన నిర్మాణ అనుమతులకు కొత్త విధానం అమల్లోకి తీసుకొస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసినప్పటికీ సాంకేతిక కారణాలతో జాప్యం జరిగింది. భవన నిర్మాణాల అనుమతుల ప్రక్రియను త్వరితగతిన జారీ చేసేలా ఈ కొత్త విధానాన్ని సర్కార్ అందుబాటులోకి తీసుకొచ్చిందని మంత్రి నారాయణ చెబుతున్నారు. సెల్ఫ్ సర్టిఫికేషన్ ద్వారా నిర్మాణాలకు అనుమతులిచ్చేందుకు అవసరమైన సాఫ్ట్ వేర్ ను ఓఖఆఖఓా పోర్టల్ లోకి అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ విధానం ఆమోదం పొందిన లేఅవుట్లు, గ్రామ కంఠం,సర్కులేషన్ ప్లాన్లు ఉన్న ప్రాంతాలు,1985 కు ముందు నిర్మించిన భవనాల పునర్మిణానానికి ఉపయోగపడుతుందని మంత్రి చెప్పారు.

టౌన్ ప్లానింగ్‌పై తీవ్ర విమర?శలు..

ఆంధ్రప్రదేశ్ పట్టణ ప్రణాళిక విభాగం పనితీరుపై తీవ్ర విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా విజయవాడ, విశాఖపట్నం వంటి మునిసిపల్ కార్పొరేషన్లలో భవన నిర్మాణాలకు అనుమతులు, ప్లాన్ మంజూరు అంటే ముడుపులతో కూడుకున్న వ్యవహారంగా మారిపోయింది. ఏ ఫీజు ఎంత వసూలు చేస్తారనే వివరాలు ఎవరికి దొరకవు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది చెప్పినంత చెల్లించాల్సిందే. నిర్ణీత ఫీజులు చెల్లించినా టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ప్రసన్నం చేసుకోకపోతే వారిని ముప్ప తిప్పలు పెడతారు. ప్లాన్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే దగ్గర నుంచి దానికి ఫీజులు జనరేట్ అయ్యే వరకు రకరకాల కొర్రీలు వేసి వేధింపులకు గురి చేస్తుంటారు. ఇక ఖాళీ స్థలాలు కట్టే నిర్మాణాలకు ఆ స్థలం కొన్నప్పటి నుంచి వేకెంట్ ల్యాండ్ టాక్స్ వసూలు చేస్తారు. మధ్యలో ఎందరి చేతులు మారినా అది రికార్డుల్లో ఎక్కినప్పటి నుంచి నిర్మాణదారులు పన్ను చెల్లించాల్సి వస్తోంది. భవన నిర్మాణాలు పూర్తై అవి అమ్ముడుపోయే వరకు ఖాళీగా ఉన్న కాలానికి కూడా ఏపీలో పన్నులు వసూలు చేస్తున్నారు. పాత ఇళ్లను కూల్చి నిర్మాణాలు చేపడితే నిర్మాణం జరిగే సమయానికి కూడా వేలకు వేలు పన్నులు వసూలు చేస్తున్నారు. పాత ఇళ్లకు ఇంటి పన్నులు, డ్రైనేజీ, వాటర్ టాక్స్‌లు చెల్లిస్తూ, కొత్త నిర్మాణాలను చేపడితే ఆ కాలానికి కూడా పన్నులు వసూలు చేస్తున్నారు. అదే సమయంలో కొత్త నిర్మాణాలకు నిబంధనల మేరకు ఫీజులు జనరేట్ చేస్తూ అవే కనెక్షన్లను కొత్తగా ఇస్తున్నట్టు అదనపు వసూళ్లు చేస్తున్నారు. ఒక పాత భవనాన్ని కూల్చి కొత్త నిర్మాణం చేపడితే పాత భవనానికి, కొత్త నిర్మాణానికి కలిపి రెండు వేర్వేరు పన్నుల్ని ఏపీలో మునిసిపల్ కార్పొరేషన్లు వసూలు చేస్తున్నాయి. నిర్మాణదారుల సమస్యల్ని పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు.

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు
7702262666

# అరకు నుంచి అమెరికాకు కాఫీ




**విశాఖపట్టణం, మార్చి 5, పెన్ పవర్:** అరకు కాఫీకి ఆర్గానిక్ సర్టిఫికేషన్ లభించింది. ఇది ఆదివాసీ రైతులకు ఎంతో మేలు చేయనుంది. ఆర్గానిక్ సర్టిఫికేషన్ ద్వారా అరకు కాఫీని యూరప్‌కు ఎగుమతి చేసే అవకాశం వచ్చింది. దీని ద్వారా దాదాపు 2600 మంది రైతులకు లబ్ధి జరగనుంది. అసలు అరకు కాఫీకి ఎందుకంత డిమాండ్.. ఆర్గానికి సర్టిఫికేషన్ అంటే ఏంటీ.. దాని వల్ల కలిగే లాభాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. అరకు కాఫీని గిరిజన రైతులు సేంద్రియ ఎరువులు ఉపయోగించి పండిస్తారు. రసాయన మందులు వాడకుండా సహజ పద్ధతుల్లో పండించడం వల్ల ఇది మరింత రుచికరంగా, ఆరోగ్యకరంగా ఉంటుంది. సముద్ర మట్టానికి 3600 అడుగుల ఎత్తులో సిల్వర్ ఓక్, మిరియాల చెట్ల మధ్య ఈ కాఫీ తోటలు పెరుగుతాయి. ఈ ప్రత్యేకమైన వాతావరణం వల్ల కాఫీ గింజలకు ఒక ప్రత్యేకమైన రుచి, సువాసన వస్తాయి. అరకులో అరబికా రకం కాఫీని పండిస్తారు. ఈ రకం కాఫీకి అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉందిఅరకు కాఫీకి అంతర్జాతీయంగా మంచి గుర్తింపు ఉంది. దీని రుచి, నాణ్యతకు గాను అనేక అవార్డులు కూడా లభించాయి. అరకు కాఫీ సాగులో గిరిజన రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారు. వారి శ్రమ, నైపుణ్యం వల్లనే ఈ కాఫీ అంత రుచికరంగా ఉంటుంది. అరకు లోయలో మహిళలు పండిస్తున్న కాఫీలో చక్కటి పరిమళం ఉందని గతంలో ఐరాస ప్రతినిధులు ప్రశంసలు కురిపించారు. కాఫీ సాగు ద్వారా ఆర్థిక సామాజిక విప్లవాన్ని తీసుకురావడంలో అరకు మహిళల కీలక పాత్ర ఉందని, అరకు మహిళలు భారత నారీశక్తికి చిహ్నాలని ఐకాస ప్రతినిధులు కొనియాడారు. అరకు కాఫీ ప్రత్యేకమైన సుగంధ లక్షణాలు కలిగి రుచికి ప్రసిద్ధి చెందింది. ఆర్గానిక్ సర్టిఫికేషన్ వల్ల అరకు కాఫీకి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గుర్తింపు లభిస్తుంది. ఆర్గానిక్ సర్టిఫికేషన్ వల్ల యూరప్, అమెరికా వంటి దేశాలకు అరకు కాఫీని ఎగుమతి చేసే అవకాశం పెరుగుతుంది. ఆర్గానిక్ కాఫీకి సాధారణ కాఫీ కంటే ఎక్కువ ధర లభిస్తుంది. ఇది గిరిజన రైతుల ఆదాయాన్ని పెంచుతుంది. ఆర్గానిక్ కాఫీలో రసాయన ఎరువులు, పురుగు మందులు ఉండవు. కాబట్టి ఇది ఆరోగ్యానికి మంచిది. ఆర్గానిక్ వ్యవసాయం పర్యావరణానికి హాని కలిగించదు. ఇది నేల, నీరు, గాలి కాలుష్యాన్ని తగ్గిస్తుంది. ఆర్గానిక్ కాఫీ సాగు గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది. అరకు కాఫీలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడతాయి. కాఫీ తాగడం వల్ల మెదడు చురుకుగా పనిచేస్తుంది. ఇది జ్ఞాపకశక్తిని పెంచుతుంది. ఈ కాఫీ తాగడం వల్ల టైప్ 2 మధుమేహం వచ్చే ప్రమాదం తగ్గుతుంది. కాఫీ తాగడం వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. కాఫీలో కెఫీన్ ఉంటుంది. ఇది శక్తిని పెంచుతుంది, అలసటను తగ్గిస్తుంది. అరకు కాఫీ ఆర్గానిక్ గుర్తింపు పొందడం వల్ల గిరిజన రైతులకు, పర్యావరణానికి, వినియోగదారులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు
7702262666

# కాణిపాకం లో రోజా పూజలు

**చిత్తూరు: పెన్ పవర్:** చిత్తూరు జిల్లాలోని కాణిపాకం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం స్వయంభు వెలసిన వరసిద్ధి వినాయక స్వామి ని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు మాజీ మంత్రి రోజా. ఈ సందర్భంగా స్వామి వారి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశాసి వేద మంత్రాలతో మాజీ మంత్రి రోజా పండితులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాజీ కాణిపాక ఛైర్మన్ మోహన్ రెడ్డి, పాక్స్ ఎక్స్ - ప్రెసిడెంట్ తిరుమల్ రెడ్డి, శ్రీ హరి రెడ్డి, నగరి రూరల్ ఎక్స్ కన్వీనర్ హరి తదితరులు పాల్గొన్నా

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు
7702262666

# వంగవీటి రాధాకు ఎమ్మెల్సీ పదవి...

**విజయవాడ, మార్చి 5, పెన్ పవర్:** విజయవాడ టీడీపీ నేత వంగవీటి రాధాకు రెండు మూడు రోజుల్లో గుడ్ న్యూస్ అందనుంది. ఆయనకు ఎమ్మెల్సీగా చేయడానికి అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఏపీలో ఎమ్మెల్యే కోటాలో ఐదు ఎమ్మెల్సీ పోస్టులు ఖాళీ అవుతున్న నేపథ్యంలో బెజవాడ నేతగా ఆయన పేరును టీడీపీ అధినాయకత్వం పరిగణనలోకి తీసుకునే అవకాశాలు వంద శాతం ఉన్నాయి. ఇప్పటికే వంగవీటి రాధాకు ఈ మేరకు సిగ్నల్స్ కూడా అందినట్లు తెలిసింది. గత ఎన్నిల్లో టిక్కెట్ దక్కకపోయినా కూటమి పార్టీ లకోసం పనిచేయడాన్ని వంగవీటి రాధాకు ప్లస్ పాయింట్ గా మారింది. పార్టీని నమ్ముకుని ఉండటం, ఓటమిపాలయినా పార్టీని అంటిపెట్టుకుని ఉండటంతో చంద్రబాబు వంగవీటి రాధాకు ఫస్ట్ ప్రయారిటీ ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చారని తెలిసింది. వంగవీటి రాధాకు ఎమ్మెల్సీ సీటు ఇచ్చినా కాపు, కమ్మ సామాజికవర్గాలకు ఒకే స్థానంతో ఇచ్చినట్లవుతుందని భావిస్తున్నారు. వంగవీటి రాధా గత రెండు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నా ఒకసారి మాత్రమే ఎమ్మెల్యేగా గెలిచారు. అది కూడా 2004లో కాంగ్రెస్ నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అదే ఆయన అధికార పార్టీలో ఉండటం. ఆ తర్వాత వంగవీటి రాధా 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరి ఓటమిపాలయ్యారు. ప్రజారాజ్యం నుంచి తర్వాత 2014లో వైసీపీలో చేరారు. అప్పుడూ ఓటమి పాలయ్యారు. పార్టీ కూడా అధికారంలోకి రాలేకపోయింది. 2019 ఎన్నికలకు ముందు ఆయన టీడీపీలో చేరి మరోసారి తన జెండాను మార్చేశారు. అయితే 2019ఎన్నికల్లో వంగవీటి రాధాకు టిక్కెట్ కేటాయించలేదు. ఇక అప్పటి నుంచి రాధా రాజకీయంగా ఇబ్బంది పడుతూనే ఉన్నారు. వంగవీటి ఇంటి పేరుకు ఉన్న బ్రాండ్ ఇమేజ్ తో ఆయన రాధా మంచి పేరున్నా ఆయనకు కలిసొచ్చే సమయం కోసం ఇప్పటి వరకూ వెయిట్ చేస్తున్నారు. ఎన్నికలు పూర్తయి తొమ్మిది నెలలు గడిచినా పెద్దగా యాక్టివ్ గా లేకపోయినా అలాగే పార్టీకి విధేయుడిగా ఉంటూనే వస్తుండటం ఆయనకు కలసి వచ్చే అంశంగా చెప్పాలి. జనసేన నుంచి నాగబాబు పేరు ఎమ్మెల్సీ పదవికి ఖరాయింది. అయితే ఈ సమయంలో వంగవీటి రాధాకు ఇస్తారా? లేదా? అన్న చర్చ కూడా జరిగింది. కానీ నాగబాబు వేరు. వంగవీటి రాధా వేరు. ఇద్దరినీ వేర్వేరుగా చూడాలంటున్నారు. రంగా అభిమానులు ఎక్కువగా ఉన్న ఏపీలో ఆయన తనయుడికి ఎమ్మెల్సీ అవకాం కల్పిస్తే వారు కూడా రాజకీయంగా తమకు ఉపయోగపడతారని చంద్రబాబు అంచనా. అందుకే వంగవీటి రాధాకు ఎమ్మెల్సీ పదవి ఫిక్స్ అయిందని టీడీపీ వర్గాల్లో పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. నాలుగు స్థానాల్లో ఒకటి వంగవీటి రాధాకు కేటాయించిన కారణంగా భవిష్యత్ లో పార్టీకి మరింత అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందని భావిస్తున్నారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వస్తే టీడీపీ అధినాయకత్వం ఎమ్మెల్సీ చేస్తామని చెప్పినా ఆ పార్టీ అధికారంలోకి రాలేకపోవడంతో వంగవీటి రాధా చట్టసభలకు దూరంగానే ఉన్నారు. వంగవీటి రాధాకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడానికి నారా లోకేశ్ కూడా సుముఖంగా ఉన్నారు. ఇటీవల ఆయన ఆరోగ్యం బాగాలేనప్పుడు స్వయంగా చంద్రబాబు, లోకేశ్ లు వెళ్లి పరామర్శించి వచ్చారు. గత ఎన్నికల్లో ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తించిన చంద్రబాబు ఈ జాబితాలోనే వంగవీటి రాధాపేరు ఎంపిక చేయాలని నిర్ణయానికి వచ్చారంటున్నారు. అమరావతి రైతుల ఉద్యమానికి కూడా రాధా సహకరించారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని రాధాను ఎమ్మెల్సీగా ఎంపిక చేయడమే మంచిదని అని పార్టీ వర్గాలు కూడా అభిప్రాయపడుతున్నాయి. శాసనమండలిలో ఎమ్మెల్సీ పదవులన్నీ కూటమికే రానుండటంతో అందులోతొలి జాబితాలోనే వంగవీటి రాధా పేరు ఉందన్నది పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం. ఈరోజు, రేపట్లో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని చెబుతున్నారు. వివాదాలకు దూరంగా ఉండే వంగవీటి రాధా కు పదవి ఇవ్వడం వల్ల కూటమి మొత్తానికి ఉపయోగకరమని మూడు పార్టీలు విశ్వసిస్తున్నాయి.

నాగేశ్వర రావు
(నగేష్ బూర్తి), సీనియర్ జర్నలిస్టు
7702262666

# రచీన్ రవీంద్ర మరో సెంచరీ.. సఫారీలపై కివీస్ పరుగుల వరద

**లాహోర్‌లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య రెండో సెమీస్**

**టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కివీస్**

**సెంచరీ (108)తో కదంతొక్కిన రచిన్ రవీంద్ర**

**విలియమ్సన్‌తో కలిసి 164 పరుగుల భారీ భాగస్వామ్యం**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఛాంపియన్స్ ట్రోఫీలో సౌతాఫ్రికాతో జరుగుతున్న సెమీ ఫైనల్ మ్యాచ్ లో న్యూజిలాండ్ బ్యాటింగ్ లో అదరగొడుతుంది. లాహోర్ వేదికగా గడాఫీ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్ లో రచీన్ రవీంద్ర సెంచరీతో కివీస్ భారీ స్కోర్ దిశగా పయనిస్తోంది. ఇన్నింగ్స్ ప్రారంభం నుంచి దూకుడుగా ఆడుతున్న రచీన్ 93 బంతుల్లో తన సెంచరీ మార్క్ పూర్తి చేసుకున్నాడు. అతని ఇన్నింగ్స్ లో 12 ఫోర్లు ఒక సిక్సర్ ఉన్నాయి. ఓవరాల్ గా రచీన్ రవీంద్ర వన్డే కెరీర్ లో ఇది ఐదో సెంచరీ కాగా.. ప్రస్తుతం జరుగుతున్న ఛాంపియన్స్ ట్రోఫీలో రెండోది. రచీన్ రవీంద్రతో పాటు స్టార్ బ్యాటర్ విలియంసన్ (64) హాఫ్ సెంచరీ చేయడంతో న్యూజిలాండ్ తొలి 32 ఓవర్లు ముగిసేసరికి వికెట్ నష్టానికి 201 పరుగులు చేసింది. క్రీజ్ లో రచీన్ రవీంద్ర (105), విలియంసన్ (72) ఉన్నారు. వీరిద్దరూ రెండో వికెట్ కు అజేయంగా 153 పరుగులు జోడించడం విశేషం. 21 పరుగులు చేసి యంగ్ ఔటయ్యాడు. ఈ దశలో క్రీజ్ లోకి వచ్చిన విలియంసన్, రచీన్ రవీంద్ర సఫారీ బౌలర్లను ఒక ఆటాడుకున్నారు. సింగిల్స్ తీస్తూ వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదారు. దీంతో అలవోకగా కివీస్ కు పరుగులు వచ్చాయి. మరో 18 ఓవర్లు ఉండడంతో ఈ మ్యాచ్ లో కివీస్ 350 పరుగుల స్కోర్ చేయడం ఖాయంగా కనిపిస్తుంది.

# ఫిట్ నెస్ అంటే కోహ్లీదే.. ఒక్క మ్యాచ్‌లోనే 56 సింగిల్స్





**హైదరాబాద్ పెన్ పవర్:** విరాట్ కోహ్లీ కేవలం బ్యాటింగ్ లోనే కాదు ఫిట్ నెస్ లోనూ టాప్ లో ఉంటాడు. ప్రపంచ క్రికెట్ లో అత్యుత్తమ ఫిట్ నెస్ కలిగిన ఆటగాళ్ల లిస్ట్ తీస్తే కోహ్లీ టాప్ లో ఉంటాడు. తన సక్సెస్ లో ఫిట్ నెస్ కీలక పాత్ర పోషించిందనడంలో ఎలాంటి సందేహం లేదు. గ్రౌండ్ లో చిరుతలా పరిగెత్తే కోహ్లీ.. వికెట్ల మధ్య వేగంగా పరిగెత్తడంలో దిట్ట. క్రీజ్ లోకి వచ్చినప్పటి నుంచి కోహ్లీ సింగిల్స్ పైనే ఎక్కువగా దృష్టి పెడతాడు. సింగిల్స్ తోనే ప్రత్యర్థికి చికాకు తెప్పిస్తాడు. బంతులే వృధా చేయకుండా సింగిల్స్ పై ఫోకస్ చేస్తూ ఇన్నింగ్స్ ను నిర్మిస్తాడు. దుబాయ్ వేదికగా ఆస్ట్రేలియాతో మంగళవారం (మార్చి 4) జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్ లో భారత్ ఘన విజయం సాధించింది. 265 పరుగుల లక్ష్య ఛేదనలో కోహ్లీ 84 పరుగులు చేసి మ్యాచ్ విన్నింగ్ నాక్ ఆడాడు. మొత్తం 96 బంతుల్లో 84 పరుగులు చేసిన కోహ్లీ ఇన్నింగ్స్ లో ఏకంగా 56 సింగిల్స్ ఉండడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. కోహ్లీ ఇన్నింగ్స్ లో మొత్తం 67 శాతం పరుగులు సింగిల్స్ తీయడం ద్వారా వచ్చాయి. మొత్తం కోహ్లీ ఇన్నింగ్స్ లో 5 బౌండరీలు మాత్రమే ఉన్నాయి. జట్టు విజయం కోసం ఎలాంటి అనవసరపు షాట్స్ ఆడకుండా సింగిల్స్ తీస్తూనే కంగారులను విజయాన్ని దూరం చేశాడు. కోహ్లీ వన్డే కెరీర్ లో మొత్తం 5,870 సింగిల్స్ ఉన్నాయి. ఏ క్రికెటర్ వన్డే కెరీర్ లో కూడా ఇన్ని సింగిల్స్ లేకపోవడం విశేషం. శ్రీలంక దిగ్గజం కుమార్ సంగక్కర 5,503 సింగిల్స్‌తో ఈ జాబితాలో రెండవ స్థానంలో ఉండగా, మహేల జయవర్దనే 4,789 సింగిల్స్‌తో మూడో స్థానంలో నిలిచాడు. భవిష్యత్తులో వన్డే ఫార్మాట్ లో కోహ్లీ సింగిల్స్ ను బ్రేక్ చేసే అవకాశం ఎవరికీ లేనట్టే కనిపిస్తుంది. ఏకపక్షంగా జరిగిన ఈ సెమీస్ ఫైట్ లో ఛేజ్ కింగ్ విరాట్ కోహ్లీ (98 బాల్స్‌లో 5 ఫోర్లతో 84) మరోసారి మాస్టర్ క్లాస్ ఆట చూపెట్టడంతో చాంపియన్స్ ట్రోఫీలో టీమిండియా ఐదోసారి ఫైనల్లోకి అడుగుపెట్టింది. అతనికి తోడు శ్రేయస్ అయ్యర్ (45), కేఎల్ రాహుల్ (42 నాటౌట్) అండగా నిలవడంతో.. మంగళవారం జరిగిన తొలి సెమీస్‌లో ఇండియా 4 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాను ఓడించింది. తొలుత ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 264 రన్స్‌కు ఆలౌటైంది. కెప్టెన్ స్టీవ్ స్మిత్ (96 బాల్స్‌లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 73), అలెక్స్ క్యారీ (57 బాల్స్‌లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 61) రాణించారు.

# న్యూజిలాండ్ తరపున ఒకే ఒక్కడు: 19 వేల పరుగుల క్లబ్‌లో విలియంసన్






**హైదరాబాద్ పెన్ పవర్:** ఛాంపియన్స్ ట్రోఫీ సెమీ ఫైనల్ మ్యాచ్ లో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మ్యాచ్‌లో న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ చరిత్ర సృష్టించాడు. లాహోర్ వేదికగా గడాఫీ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్ లో తన పేరిట అరుదైన రికార్డ్ లిఖించుకున్నాడు. ఈ మ్యాచ్ లో 27 పరుగుల వద్ద 1900 పరుగులను పూర్తి చేసుకొని న్యూజిలాండ్ తరపున ఈ ఘనత సాధించిన తొలి బ్యాటర్ గా నిలిచాడు. విలియమ్సన్ 3 ఫార్మాట్ లలో 440 అంతర్జాతీయ ఇన్నింగ్స్‌లో ఈ ఘనతను అందుకున్నాడు. 19 వేల పరుగుల క్లబ్ లోకి ఎంట్రీ ఇచ్చిన నాలుగో ఫాస్టెస్ట్ బ్యాటర్ గా నిలిచాడు. 19000 అంతర్జాతీయ పరుగులు వేగంగా పూర్తి చేసిన ఆటగాళ్ల జాబితాలో విరాట్ కోహ్లీ (399) అగ్ర స్థానంలో ఉన్నాడు. క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ (432) రెండవ స్థానంలో నిలిచాడు. బ్రియాన్ లారా (433) మూడవ స్థానంలో ఉన్నాడు. ఈ ముగ్గురి తర్వాత 440 ఇన్నింగ్స్ ల్లో 19 వేల పరుగులను పూర్తి చేసుకున్న నాలుగో ఫాస్టెస్ట్ బ్యాటర్ గా నిలిచాడు. ఓవరాల్ గా ఈ ఘనత సాధించిన సాధించిన 16వ ఆటగాడు విలియంసన్. ఈ క్రమంలో అన్ని ఫార్మాట్లలో 18,995 పరుగులు చేసిన ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ డేవిడ్ వార్నర్‌ను అధిగమించాడు. అంతేకాదు ఈ మ్యాచ్ లో 10 పరుగులు పూర్తి చేసుకున్న తర్వాత న్యూజిలాండ్ తరపున ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. అంతకముందు ఈ రికార్డ్ స్టీపెన్ ఫ్లెమింగ్ పేరిట ఉంది. ఫ్లెమింగ్ 13 ఇన్నింగ్స్‌లలో 441 పరుగులు చేయగా.. విలియంసన్ ఈ రికార్డ్ అధిగమించాడు. రచీన్ రవీంద్రతో పాటు స్టార్ బ్యాటర్ విలియంసన్ (64) హాఫ్ సెంచరీ చేయడంతో న్యూజిలాండ్ తొలి 32 ఓవర్లు ముగిసేసరికి వికెట్ నష్టానికి 201 పరుగులు చేసింది. క్రీజ్ లో రచీన్ రవీంద్ర (105), విలియంసన్ (72) ఉన్నారు. వీరిద్దరూ రెండో వికెట్ కు అజేయంగా 153 పరుగులు జోడించడం విశేషం.

**కాల్విన్ క్లీన్ లోదుస్తుల లో దిశా పటానీ స్టన్స్**



# శ్రీలీలను భాగ్య శ్రీ బోర్సే పక్కకు నెట్టేసిందా?

**సాధారణ శైలిలో కేతిక యొక్క అద్భుతమైన స్నాప్‌షాట్‌లు**





తెలుగు అమ్మాయి శ్రీలీల కెరీర్ ప్రారంభించి ఐదేళ్లు అవుతుంది. నటిగా మంచి గుర్తింపును సంపాదించుకుంది. యువతలో క్రేజీ బ్యూటీగానూ పాపులర్ అయింది. కానీ అమ్మడి టాలీవుడ్ కెరీర్ మాత్రం ఆశించిన విధంగా సాగలేదు. ఫెయిల్యూర్స్ తో పాటు అమ్మడికి సక్సెస్ లు ఉన్నాయి. కానీ అవకాశాలు మాత్రం ఆశించిన విధంగా రాలేదు అన్నది వాస్తవం. ఈ విషయంలో శ్రీలీలను భాగ్య శ్రీ బోర్సే పక్కకు నెట్టేస్తుందా? అన్న అనుమానాలు తెరపైకి వస్తున్నాయి.'మిస్టర్ బచ్చన్' తో భాగ్య శ్రీ బోర్సే టాలీవుడ్లో లాంచ్ అయిన సంగతి తెలిసిందే. ఆ సినిమా డిజాస్టర్ అయింది. కానీ ప్రస్తుతం అమ్మడి లైనప్ లో ఉన్న జాబితా చూస్తే స్టన్ అవ్వాల్సిందే . ఒక్క క్షణం ఆలోచిస్తే ఈ ఛాన్సులన్నీ శ్రీలీలకు ఎందుకు రాలేదు? అనిపిస్తుంది. ప్రస్తుతం భాగ్య శ్రీ బోర్సే విజయ్ దేవరకొండకు జోడీగా 'కింగ్ డమ్' లో నటిస్తోంది. అలాగే కోలీవుడ్ లో దుల్కర్ సల్మాన్ సరసన 'కాంత'లోనూ నటిస్తోంది.సూర్య కథనాయకుడిగా వెంకీ అట్లూరీ చిత్రంలోనూ ఈ భామనే హీరోయిన్ గా ఎంపికైంది. ఇక ఎనర్జిటిక్ స్టార్ రామ్ కొత్త చిత్రంలో సైతం భాగ్యనే నటిస్తోంది. మరోవైపు ప్రభాస్ హీరోగా ప్రశాంత్ వర్మ తెరకెక్కించాల్సిన ప్రాజెక్ట్ కు భాగ్య శ్రీ బోర్సేనే ఎంపిక చేసినట్లు వార్తలొస్తున్నాయి. ఇవన్నీ కూడా పాన్ ఇండియా ప్రాజెక్ట్ లే. ఒకేసారి ఇన్ని పాన్ ఇండియా చిత్రాల్లో అవకాశం అంటే చిన్న విషయం కాదు.ఆ పరంగా భాగ్య శ్రీ నక్క తోక తొక్కినట్లే. అయితే వీటిలో కొన్ని అవకాశాలు శ్రీలీలకు రావాల్సినవి భాగ్య శ్రీకి వచ్చాయి? అన్నది ఫిలిం సర్కిల్స్ లో వినిపిస్తోన్న మాట. కొన్ని రొమాంటిక్ సన్నివేశాల్లో శ్రీలీల ముందుకు వస్తుందా? రాదా? అన్న సందేహంలో దర్శక, నిర్మాతలు భాగ్య శ్రీని తీసుకున్నట్లు వినిపిస్తుంది.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com